

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
ఆదివారం | 12 నవంబర్ 2023 | www.navatelangana.com



టిక్కెట్ దక్కని కాంగ్రెస్ నేతలు ఒక్కొక్కరిగా కారెక్కుతున్నారు. సుదీర్ఘకాలంగా ఒకే పార్టీలో ఉన్న నాయకులు సైతం ఆ పార్టీని వీడుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఆయా నేతల పార్టీ ఫిరాయింపు బాధ్యతను చేపట్టిన రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆపరేషన్ ను సక్సెస్ ఫుల్ గా నిర్వహిస్తున్నారు. పదవులు, రూ. కోట్ల ఆఫర్ ప్రకటిస్తుండటం, కేటీఆర్ నేరుగా వారితో మాట్లాడుతుండటం... కోరిన కోర్కెలకు సుముఖత వ్యక్తం చేస్తుండటంతో హస్తానికి హ్యాండ్ ఇచ్చి కారు ఎక్కుతున్నారనే చర్చ సాగుతోంది. ఇలా చేరుతున్న నేతల్లో ఒకరిద్దరు మినహా మిగతా వారు ఏ మేరకు ప్రభావితం చేస్తారనే దానిపై కూడా భిన్న వాదనలు ఉన్నాయి.

కారెక్కుతున్న కాంగ్రెస్ నేతలు

- టిక్కెట్ దక్కకపోవడంతో ఫిరాయింపులు
- పదవులు, రూ. కోట్లకు అమ్ముడుపోతున్న నాయకులు
- బిఆపరేషన్ చేపట్టిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఎంపీ వద్దిరాజు ఆపరేషన్ సక్సెస్...

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల బాధ్యతలు చూస్తున్న రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇతర సెగ్మెంట్లలోనూ తనదైన రీతిలో చక్రం తిప్పుతున్నారు. కాంగ్రెస్ అసమ్మతి నేతలను కారు ఎక్కించటంలో తనదైన చతురతను ప్రదర్శిస్తున్నారు. ఎంపీ వద్దిరాజు ఆపరేషన్ సక్సెస్ కావడంతో సీఎం కేసీఆర్ జిల్లా నేతల కృషిని అభినందించారు. సమిష్టి కృషితో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రత్యేకంగా ఎంపీ వద్దిరాజు కృషిని అభినందించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన రవిచంద్ర కు ఆ పార్టీ నేతలతో సత్సంబంధాలు

▸ మిగతా 3లో...

రేపు కేసీఆర్ రాక

- దమ్మపేట, బూర్గంపాడు మండలాల్లో ఆశీర్వాద సభలు
- నాడు బూర్గంపాడు విచ్చేసిన వైఎస్ఆర్
- మండలానికి అరుదైన రికార్డు



నవతెలంగాణ -బూర్గంపాడు

భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం మల్లారం రోడ్డు, బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామాల్లో సోమవారం జరగనున్న ఆశీర్వాద సభకు కే.చంద్రశేఖర రావు హాజరుకానున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లను బిఆర్ఎస్ పార్టీ చేపట్టింది. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామం ప్రధాన రహదారికి పక్కన ఉన్న సుమారు 20 ఎకరాల స్థలంలో సీఎం ఆశీర్వాద సభను నిర్వహించనున్నారు. గత నాలుగు రోజు లుగా సీఎం సభ ఏర్పాట్లను

▸ మిగతా 3లో...

సీపీఐ(ఎం) వైరా అభ్యర్థి ఎన్నికల ప్రచారం ప్రారంభం

బోడేపుడి స్మారక స్థూపానికి నివాళులు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్

సీపీఐ(ఎం) వైరా అసెంబ్లీ అభ్యర్థి భూక్యా వీరభద్రం ఎన్నికల ప్రచారాన్ని ఆదర్శనేత, మాజీ శాసనసభ్యులు అమరజీవి బోడేపూడి వెంకటేశ్వరరావు స్మారక స్థూపం వద్ద నివాళులర్పించి సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు ప్రారంభించారు. శనివారం గండగలపాడు గ్రామంలోని బోడేపుడి వెంకటేశ్వరరావు స్మారక స్థూపంకు బొంతు రాంబాబు, ఇమ్మడి వీరభద్రం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామశాఖా కార్యదర్శి గుమ్మా నరిసింహరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో బొంతు రాంబాబు మాట్లాడుతూ ఈనెల 30న జరిగే తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో రాజ్యాంగ విరుద్ధంగా వందల కోట్ల రూపాయలతో ఓట్లు కొనుగోలు చేసి గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నా అభ్యర్థులను ఓడించి నిజమైన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఎన్నికల అంటే కొనుగోలు, అమ్మకాల ప్రక్రియగా మార్చిన కార్పొరేట్ రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓటు అనే ఆయుధంతో మట్టి కరిపించాలన్నారు. అమరజీవి బోడేపూడి వెంకటేశ్వరరావు వైరా ప్రాంతం నుంచి మూడు దఫాలు మధిర శాసనసభ్యులుగా ఎన్నికై నిబద్ధతతో నీతి, నిజాయితీ రాజకీయాలు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రైతు బాంధువుడుగా పేరు తెచ్చుకున్న మహోన్నత వ్యక్తి అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పోరాడుతున్న సిపిఐ(ఎం) అభ్యర్థి భూక్యా వీరభద్రం సుత్తి కోడవలి నక్షత్రం గుర్తు పైన ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మచ్చా మణి



జెండా ఊపి ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మల్లెంపాటి రామారావు, ఇమ్మడి సుధీర్, పల్లెబోయిన కృష్ణ, పాపగంటి రాంబాబు, కిన్నెర మోతీ, నారాయణ, యనమద్ది రామకృష్ణ, పుచ్చకాయల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలు సీపీఐ(ఎం)లో చేరిక

గండగలపాడు గ్రామంలోని పలు కుటుంబాలు సిపిఐ(ఎం)లో చేరారు. వారికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు ఎర్రజెండా వేసి స్వాగతం పలికారు.

మైనార్టీలపై బీజెపి, బీఆర్ఎస్‌ది ఒకటే వైఖరి

కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు మహమ్మద్ జావేద్

నవతెలంగాణ- ఖమ్మం

మైనారిటీల అభివృద్ధిపై బీఆర్ఎస్, బిజెపిది ఒకటే వైఖరి అని కాంగ్రెస్ పార్టీ నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ ఆరోపించారు. శనివారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, బిజెపి రెండు పర్యాయాలుగా అధికారంలో ఉన్నాయని, ఈ రెండు ప్రభుత్వాలు మైనారిటీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. అధికారంలోకి రాగానే మైనారిటీల 4శాతం రిజర్వేషన్‌ను 12 శాతానికి పెంచుతానని ప్రగల్భాలు పలికిన కేసీఆర్‌కు రెండు పర్యాయాలుగా మైనారిటీలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. రిజర్వేషన్లను పెంచడంలో వక్ఫ్ ఆస్తులను కాపాడడంలో విఫలం చెందిన బిఆర్ఎస్‌కు మైనారిటీల ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. 1993లో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రారంభించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సే అని గుర్తు చేశారు. సమావేశంలో ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ మీడియా ఇంచార్జి బిఆర్ అనిల్ కుమార్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మైనారిటీ రాష్ట్ర నాయకులు రబ్బాని, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చోటా బాబా, మాజి సిటీ సెంట్రల్ లైబ్రరీ ఛైర్మన్ ఆశ్రిఫ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు రామిశెట్టి మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన యోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఖమ్మం నియోజకవర్గ పిసిసి సభ్యులు మహ్మద్ జావేద్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు రబ్బాని, జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటి అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య జిల్లా ఓబిసి సెల్ అధ్యక్షులు, ఖమ్మం నియోజకవర్గ పిసిసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు గౌస్, మాజీ ఖమ్మం ఏఎంసీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చోటా బాబా , సాధు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



చంద్రబాబు అరెస్ట్‌లో కేసీఆర్ సహకరం ఉంది

రాందాస్ నాయక్ గెలుపు కోసం కలిసి పనిచేయాలి

కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు

నవతెలంగాణ-కొణిజర్ల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకి పంపించిన వ్యవహారంలో బిజెపి, వైసీపీ పార్టీలకు ముఖ్యమంత్రి కేసీఆర్ సహకరం ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు ఆరోపించారు. మండల పరిధిలోని పెద్దగోపతి గ్రామంలో టీడీపీ మండలాద్యాక్షుడు తాతా సుధాకర్ అధ్వర్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ కి మద్దతు ఇవ్వాలి అని శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ సమావేశానికి పోట్ల నాగేశ్వరరావు హాజరై అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న మాళోత్ రాందాస్ నాయక్‌కి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మచ్చలేని మాజీ ముఖ్యమంత్రి అభివృద్ధికి చిరునామాగా నిలిచిన చంద్రబాబు నాయుడు పై కక్ష్యపూరితంగా వ్యవహరించి 55 రోజుల పాటు జైల్లో ఉంచి పైశాచిక ఆనందం పొందిన వారికి భవిష్యత్‌లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. టీడీపీ మండల పార్టీ వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తూ ప్రకటించి తీర్మానం చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి రాందాస్ నాయక్ గెలుపు కోసం టిడిపి కాంగ్రెస్ కార్యకర్తలు కలిసి పనిచేయాలని కోరారు. అనంతరం ఎల్డీయం ఛైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరంపల్లి రామారావు గుమ్మా రోశయ్యలు మాట్లాడుతూ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని రాందాస్ నాయక్ గెలుపులో భాగస్వామ్యం అవుతున్న టిడిపి మండల పార్టీని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మోత్కూర్ వెంకటేశ్వరావు, పెద్దగోపతి సర్పంచ్ దానియేలు, ఎస్కే. సైదులు, రాం మల్లయ్య లింగాల భాస్కర్‌రావు, బండారుపల్లి భాస్కరరావు, సత్యం పాల్గొన్నారు.

ఖమ్మంను కాంగ్రెస్ చేతిలో పెట్టి ఆగం చేసుకుందామా..

రోడ్ షోలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్

నవ తెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం నగరంలోని 25, 26, 37, 38వ డివిజన్లలో బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం నియోజవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.వీధుల్లో రోడ్ షో నిర్వహించి ఓటర్లను పలకరిస్తూ.. తనకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ల పాలించి ఖమ్మంకు కాంగ్రెస్ పార్టీ చేసింది శూన్యమన్నారు. ఈ నెల 16వ తేదీన ఖమ్మంలో బిఆర్ఎస్ పార్టీ విజయాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర హోం శాఖ మంత్రి మెహామూద్ అలీ ఖమ్మం పర్యటన ఉందని, పలు డివిజన్లలో పర్యటిస్తారని, అనంతరం సాయంత్రం 4గంటలకు బహిరంగ సభ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార ముక్తార్, కార్పొరేటర్‌లు గోళ్ళ చంద్రకళ వెంకట్, ఆలీయా షౌకత్ అలీ, సీనియర్ నాయకులు జహీర్ అలీ, మెహబూబ్ అలీ, పల్లా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్త్రీ చేసి ప్రచారం...

ఖమ్మంలో 5వ డివిజన్ లో ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను గడపగడపకు వివరించారు. డివిజన్‌లో ఓ ఇస్త్రీ దుకాణం వద్ద స్వయంగా దుస్తులను ఇస్త్రీ చేసి వ్యాపారులను, కార్యకర్తలను ఉత్తేజపరిచారు.



ఆరు గ్యారెంటీ పథకాలు

ప్రతి ఒక్కరికీ అందుతాయి

కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ ఇమామ్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 39వ డివిజన్‌లో శనివారం ఖమ్మం నియోజవర్గ అభ్యర్థి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కలిసి తుమ్మలను గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ జోరుగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతాయన్నారు. కార్యక్రమంలో షేక్ ఇమామ్, ఎస్‌కె.వసీం, గౌస్ పాషా, రంజాన్, సయ్యద్ అహ్మద్, సయ్యద్ వాజిద్, ఫయాజ్, షేక్.అబ్దుల్, బలుసు నాగేశ్వరరావు, రెహమాన్, తాజుద్దీన్, రవీంద్రం, ఖాదర్, ఇబ్రహీం, ఖాజా, ముజ్జు, తిరుపతిరావు, సిహెచ్.శ్రీనివాస్, రియాజ్, అన్వర్, అక్రమ్, యాకూబ్, అఫ్జల్, నాగుల్ పాల్గొన్నారు.

2018కి ముందు నీ స్థానికత ఎక్కడా...?

మండలానికో షాడో ఎంఎల్ఏలు

కందాళపై పొంగులేటి విమర్శలు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

హైదరాబాద్‌లో స్థిరపడి బాగా డబ్బులు సంపాదించి సరిగ్గా ఎన్నికలకు 15 రోజులు ముందు వచ్చి కాంగ్రెస్ సీటుపై గెలిచి స్థానికులు, స్థానికేతరులని ఇప్పుడు మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డిపై పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. ఏదులాపురం పంచాయతీ వరంగల్ క్రాస్ రోడ్‌లో గల "మా"కాంప్లెక్స్‌లో శనివారం సయ్యద్ సాదిఖ్ అలీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పొంగులేటి మాట్లాడారు...తాను ఖమ్మం జిల్లా బిడ్డనని ఇక్కడే పుట్టి పెరిగి రాజకీయాలు చేస్తున్నానన్నారు. అన్ని గ్రామాలు తనవేనని ప్రజలంతా నా కుటుంబ సభ్యులేనన్నారు. ప్రజలు ఒక్కరిని ఎమ్మెల్యేగా దీవిస్తే పాలేరులో ఇప్పుడు మండలానికో షాడో ఎమ్మెల్యేలు తయారయ్యారన్నారు. అందులో ప్రధానంగా రూరల్ మండలంలో ఓ షాడో ఎమ్మెల్యే ఉన్నాడని, అతను



చేసే దౌర్జన్యాలు అన్నీ ఇన్నీ కావన్నారు. ఐదేళ్లుగా జరిగిన అరాచకాలు అన్నింటిని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, ప్రస్తుత ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన లభిస్తుందని, అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో విరజిల్లుతారన్నారు. అనంతరం కూసుమంచి మండలం భగత్ వీడు తండా బీఆర్ఎస్ సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపిటిసిలతో పాటు వంద కుటుంబాలు పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాయి. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, మద్ది మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, కాంగ్రెస్ నాయకులు భూక్య సురేష్‌నాయక్, వెంపటి రవి, వెంపటి వెంకన్న, కళ్లెం శేషిరెడ్డి, సిపిఐ నాయకులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, వెంపటి సురేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

కారెక్కుతున్న కాంగ్రెస్ నేతలు

మొదటిపేజీ తరువాయి

ఉన్నాయి. దానిని ఉపయోగించుకొని మాజీ మంత్రి, టీపీసీసీ ముఖ్య నేత సంభాని చంద్రశేఖర్ సహా ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు నాయకులను కారెక్కించటంలో వద్దిరాజు నేర్పరితనం ప్రదర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య, కొత్తగూడెం, సత్తుపల్లి, వైరా, ఇల్లందు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలు ఎడవల్లి కష్ణ, కోటూరి మానవతారాయ్, డాక్టర్ రాంచందర్ నాయక్, మడత వెంకట్ గౌడ్ లకు కేసీఆర్ ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి శుక్రవారం తీసుకున్నారు. అంతకుముందు వీరందరినీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రగతిభవన్ కు పిలిపించుకున్నారు. పార్టీలోకి ఆహ్వానిస్తూ.. శు భాకాంక్షలు తెలిపారు. ఇది జరిగి 24 గంటలు కూడా కాకముందే మరికొందరు కాంగ్రెస్ నేతలు కారెక్కారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రధాన అనుచరురాలు.. ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, పొంగులేటి ముఖ్య అనుచరుడు కొండూరి సుధాకర్ లు శనివారం ప్రగతిభవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు.

టిక్కెట్లు రాకపోవడంతోనే ఫిరాయింపులు..!

నియోజకవర్గ సర్వతో ముఖాభివద్ధికి పార్టీ మారినట్లు చెబుతున్నా వ్యక్తిగత ప్రయోజనాల కోసమే నేతలు ఫిరాయింపులకు పాల్పడుతున్నట్లు చర్చ సాగుతోంది. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సున్నం నాగమణికి అశ్వారావుపేట కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. మరో వైపు ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకుని, సత్తుపల్లి అసెంబ్లీ టికెట్ కోసం కాంగ్రెస్ పార్టీలో చేరిన కొండూరి సుధాకర్ పేరును పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏఐసీసీ పరిశీలన దాకా తీసుకెళ్లారు. కానీ ఈ ఇద్దరు నేతలు తమ అనుచరులకు టిక్కెట్ ఇప్పించుకోలేక పోయారు. తమ నేతలు టికెట్ పేరుతో తమను వాడుకుని వదిలేశారని ఆరోపిస్తూ.. ఈ ఇద్దరు నేతలు బీఆర్ఎస్ లో చేరారు. అధికారంలో ఉన్నాలేకున్నా సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ కోసం పాటుపడుతున్న తమను పార్టీ నిర్లక్ష్యం చేయడంపై సంభాని చంద్రశేఖర్, ఎడవల్లి కష్ణ, మానవతారాయ్ నిరాశకు లోనయ్యారు. పార్టీ అంతర్గత సర్వేలో సంబంధిత నేతలు వెనుక పడినట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ సర్వేలో వెనుకబడినా తమ వర్గం నాయకులు ఒకరిద్దరికి టిక్కెట్లు ఇప్పించిన భట్టి, పొంగులేటి తమను మాత్రం నిర్లక్ష్యం చేశారని ఫిరాయింపు నేతలు ఆరోపిస్తున్నారు. తొడకొట్టలైన కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వర్లు, ఎడవల్లి కష్ణల మధ్య సత్సంబంధాలు లేనప్పటికీ వారిద్దర్నీ ఒక తాటి మీదకు తేవడంలో ఎంపీ వద్దిరాజు సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. మొదట్లో పొంగులేటి పోటీ చేస్తాడని భావించిన కొత్తగూడెం స్థానాన్ని సిపిఐకి కేటాయించడంతో ఎడవల్లి ఆశలు నీరుగారడంతోనే ఆయన పార్టీ వీడారనే చర్చ సాగుతోంది.

స్వప్రయోజనాలతోనే...!

స్వప్రయోజనాలతోనే నేతలు పార్టీ వీడుతున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు వెలబడుతున్నాయి. రూ. కోట్లు, పదవులు ఆశచూపడంతోనే పార్టీ మారారనే చర్చ సాగుతోంది. కొండూరు సుధాకర్ ఉద్యోగ విరమణకు ఏడాది సమయం ఉండగా రిజైన్ చేశారు. తిరిగి ఆయన్ను విధుల్లోకి తీసుకోవడంతో పాటు ఎక్స్ టెన్షన్ చేస్తామనే హామీ మేరకు పార్టీ వీడినట్లు ప్రచారం సాగుతోంది. దీన్ని ఆయన భార్య కొండూరు రత్నకుమారి ఖండించారు. సత్తుపల్లి నుంచి టికెట్టు పొందిన మట్టా రాగమయి ఎలా గెలుస్తుందో చూస్తామని హెచ్చరించారు. మిగతా నేతలు కూడా ఇదే పంతంతో ఉన్నారు.

రేపు కేసీఆర్ రాక

మొదటిపేజీ తరువాయి



స్థానిక పినపాక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రేగా కాంతారావు దగ్గరుండి మరి ఏర్పాట్లు పరివేక్షిస్తున్నారు. తొలిసారిగా బూర్గంపాడు మండలంలో సీఎం కేసీఆర్ సభ నిర్వహణకు అధికార పార్టీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. అదే విధంగా భారీ ఎత్తున మండలం నుంచి సుమారు 25 వేల మంది జన సమీ కరణ చేయుటకు పార్టీ సిద్ధమైంది. అదే విధంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ పై పార్టీ దృష్టి సారించింది. అలాగే 60 వేల మంది జన సమీకరణ చేయాలని అన్ని రకాల ఏర్పాట్లను చేస్తోంది. ఈ క్రమంలో బూర్గంపాడు మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు రానున్నారు.

నాడు వైఎస్సార్...

బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి బంజర గ్రామంకు 2006 మే 11న అప్పటి సీఎం వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఇందిరమ్మ పథకం ప్రారంభోత్స వానికి విచ్చేశారు. మోరంపల్లి బంజర గ్రామం లోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించింది. కాకా బూర్గంపాడు మండలంలో ఇద్దరు సీఎంలు పాల్గొనటం రికార్డుగా మారనుంది.

సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ, డీఎస్పీలు

మండల పరిధిలోని లక్ష్మీపురంలో ఈనెల 13న నిర్వహించతలపెట్టిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ ఏర్పాట్లను శనివారం భద్రా చలం ఏఎస్పీ పంకజ్ పారితోష్ మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, ఎస్సై రాజ్ కుమార్ లు పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని కలియతిరిగి సభావేదిక ఎక్కడ నిర్మించాలి. పార్కింగ్ ఎటు ఏర్పాటు చేయాలి...సభా వేదిక అనుకూలంగా ఉందా.. లేదా... ప్రజలు ఎటువైపు కూర్చుం టారనే దానిపై నాయకులతో చర్చించారు. పోలీసు అధికా రులతో పాటు సీఎంవో కార్యాలయ సిబ్బంది కూడా ఈ సభా ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. సభ ఏర్పా ట్లలో ఎలాం టి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయా లని, సభకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బంది లేకుం డా చూసుకోవాలని నిర్వాహలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్చార్జ్ షేక్ అన్వర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎన్ఎన్. రాజు, టిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కామిరెడ్డి రామ కొండారెడ్డి, గోనె దారుగా, తూము రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల చూపు కాంగ్రెస్ వైపు... గెలుపు ఖాయం

40 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరికల సభలో అభ్యర్థి కోరం కనకయ్య

నవతెలంగాణ-ఇల్లందు

గత తొమ్మిదేళ్లుగా ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసి నియంత పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ పార్టీని ఓడించడానికి ప్రజల చూపు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని గెలుపు ఖాయమని జిల్లా చైర్మన్, ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కోరం కనకయ్య అన్నారు. మండలంలోని సుదిమళ్ళ గ్రామ పంచాయతీ, పాత నర్సాపురం గ్రామ వార్డు సభ్యురాలితో సహా, మరో 40 కుటుంబాలు శనివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పులి సైదులు, ప్రధాన కార్యదర్శి అరెం కిరణ్, ఇల్లందు మండల ఎంపీపీ చీమల నాగరత్నమ్మ,స్థానిక సర్పంచ్ కల్తీ పద్మ,మాజీ ఎంపీపీ మోకాళ్ళ వెంకటమ్మ,బాలాజీ నగర్ ఉప సర్పంచ్ వల్లాల రంజిత్, వార్డు సభ్యుడు ఊరుగొండ ధనుంజయ్, నాయకులు జానీ,కున్సోత్ రాము,రావూరి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గూటికి ములకలపల్లి జెడ్పీటీసీ

మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరిక

నవతెలంగాణ-ములకలపల్లి

ములకలపల్లి కాంగ్రెస్ పార్టీకి చెందిన జెడ్పీటీసీ సున్నం నాగమణి బీఆర్ఎస్ గూటికి చేరారు. శనివారం రాష్ట్ర పురపాలకశాఖామంత్రి కేటీఆర్ సమక్షంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో ప్రగతిభవన్ లో గులాబీ పార్టీలో చేరారు. దీంతో కేటీఆర్ ఆమెతో పాటు అనుచరులకు గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సున్నం నాగమణి మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల పార్టీ మారాల్సి వచ్చిందని, పార్టీలో శక్తికి మించి పనిచేశానని... టికెట్ - ఆశించినా దక్కలేదని, ఉమ్మడి జిల్లాలో అగ్రజుడిని అని చెప్పుకునే వ్యక్తి పొమ్మనలేక పొగపెట్టడంతో మహిళలకు గౌరవం లేనిచోట నేను ఇమడలేక బీఆర్ఎస్ పార్టీలో చేరే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు, అభిమానులు తన నిర్ణయాన్ని గౌరవిస్తారని భావిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల ప్రకాష్ రావు, ఆమె అనుచరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాంగ్రెస్ గూటికి

పొంగులేటి సమక్షంలో బెల్లంకొండ చేరిక

నవతెలంగాణ-బూర్గంపాడు



ఖమ్మం మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బెల్లంకొండ రామారావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మంలోని పొంగులేటి కార్యాలయంలో శనివారం సారపాక గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మండలంలో అందరికీ సుపరిచితుడు అయిన బెల్లంకొండ రామారావు సుమారు 50 మందితో కాంగ్రెస్ లోకి చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షుడు దుగ్గెం పూడి కృష్ణారెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మొహ్మద్ ఖాన్, జిల్లా కార్యదర్శి చల్లా వెంకట నారాయణ ,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రీని వాస్ రెడ్డి, నాయకులు ఇంగువ రమేష్, లక్ష్మీ పురం గ్రామ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వ ర రెడ్డి, కోట నాగిరెడ్డి పాల్గొన్నారు.

13న ఇల్లందు నియోజక వర్గ స్థాయి విస్తృత సమావేశం

నియోజవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి దుగ్గి కృష్ణ

నవతెలంగాణ-ఇల్లందు



సాధారణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 13న ఇల్లందు నియోజక వర్గ స్థాయి విస్తృత స వా ఏ శం నిర్వహించనున్నట్లు అసెంబ్లీ నియోజక వర్గ సీపీఐ(ఎం) పార్టీ అభ్యర్థి దుగ్గి కృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శి అబ్దుల్ అభి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం మాట్లాడారు. ఈ సమావేశానికి తండాలు, గ్రామాలు, పట్టణాల నుండి సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు, పార్టీ సభ్యులు సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగయ్య. పి. సుదర్శన్ రావు, ఖమ్మం,భద్రాద్రి కొత్తగూడెం,మహ'బాద్ జిల్లాల పార్టీ కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య,సాదుల శ్రీనివాస్ జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు పాల్గొంటారు. కావున పార్టీ మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, ప్రజా సంఘాల బాధ్యులు, ప్రజా ప్రతినిధులు స్థానిక ఏలూరి భవన్ లో ఉదయం 10 గంటలకు తప్పక హాజరు కావాలని కోరారు.



బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పినపాక

బీఆర్ఎస్ పార్టీ అమలు చేసే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు చేసిన అభివృద్ధి పనులు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టాయని బీఆర్ఎస్ నాయకులు కొండెరు నాగభూషణం తెలియజేశారు. పినపాక మండలం ఉప్పాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు వారా శంకర్, పటేల్ మనోహర్, వీర ముష్టి ప్రభాకర్, కొండేరు నాగేశ్వరరావులు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. త్వరలో అనేకమంది బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని, అభివృద్ధి సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తాయని అన్నారు.

నవతెలంగాణ

'మువ్వా'ను కలిసిన డాక్టర్ 'మట్టా'

రాగమయి గెలుపుకు కృషిచేస్తా : మువ్వా

నవతెలంగాణ-సత్తుపల్లి



డీసీసీబీ మాజీ ఛైర్మెన్, పొంగులేటి ప్రధాన అనుచరుడు, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యులు మువ్వా విజయబాబును ఆయన నివాసంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై దయానంద్ విజయబాబుతో చర్చించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని, పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి రాగమయిని భారీ మెజారిటీతో గెలిపించే దిశగా తనవంతు కృషి ఉంటుందని విజయబాబు దయానంద్‌కు తెలిపారు. దయానంద్ వెంట కాంగ్రెస్ నాయకుడు ఇమ్మనేని ప్రసాద్ ఉన్నారు.



నేడు తమ్మినేని వీరభద్రం ప్రచార కార్యక్రమం

సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు బండి రమేష్ పిలుపు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

తమ్మినేని వీరభద్రం ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు బండి రమేషన్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జూపెడ గ్రామంలో సీపీఐ(ఎం) మండల ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం శనివారం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడారు. సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమ్మినేని వీరభద్రం ప్రచార యాత్ర హైదరసాపేటలో ఆదివారం ప్రారంభం అయితావుందని, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు అందరూ తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలో పడమటి తండా, హైదర్ సాయిపేట, పాతర్లపాడు, జల్లేపల్లి, తిప్పారెడ్డిగూడెం, గోల్ తండ, దమ్మాయిగూడెం, గ్రామాలలో ఎలక్షన్ ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు, నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న సీపీఐ(ఎం)ని ప్రజల ఆదరించాలని, తమ్మినేని వీరభద్రంను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో తుళ్లూరి నాగేశ్వరరావు, అంగిరేకుల నరసయ్య, బింగి రమేష్, కొత్తపల్లి వెంకన్న, వర్షపొంగు వీరన్న, నాగాటి సురేష్, దాసరి మహేందర్, కోట ఉపేందర్ రెడ్డి, భూక్య వెంకన్న, అల్లి యశోద, అయోధ్య, ఇందుర్తి కృష్ణారెడ్డి, దొండేటి నిర్మల్ రావు తదితరులు పాల్గొన్నారు.

చెరువుమాదారంలో కందాల దీపిక ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-నేలకొండపల్లి



బిఆర్ఎస్ పార్టీ పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కందాల ఉపేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శనివారం ఆయన కుమార్తె కందాల దీపిక మండలంలోని చెరువుమాదారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరిని ఓట్లు అభ్యర్థిస్తూ కారు గుర్తుపై ఓట్లేసి కందాల ఉపేందర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నంబూరి శాంతకుమారి, సిడిసి చైర్మన్ నెల్లూరి లీల ప్రసాద్, రైతుబంధు సమన్వయ సమితి మండల కన్వీనర్ శాఖమూరి సతీష్, వజ్జా శ్రీనివాసరావు, మరికంటి రేణుబాబు, ఎన్నపోయిన శ్రీను, కోటి సైదారెడ్డి, భూక్య సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి అభివృద్ధి 'సండ్రతోనే'

- ప్రచారంలో సండ్ర సతీమణి మహాలక్ష్మీ

నవతెలంగాణ-సత్తుపల్లి



బీఆర్ఎస్ అభ్యర్థిగా సత్తుపల్లి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేస్తున్న సండ్ర వెంకట వీరయ్యతోనే సత్తుపల్లి అభివృద్ధి జరుగుతుందని, ఇంకా ఎవరివల్ల కాదని సండ్ర సతీమణి మహాలక్ష్మి ప్రజలకు వివరిస్తున్నారు. శనివారం సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో మహాలక్ష్మి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంచుతూ అందులో పొందుపర్చిన అంశాలను ప్రజలకు వివరిస్తున్నారు. నియోజకవర్గంలో సుమారుగా రూ.వెయ్యికోట్ల అభివృద్ధి జరిగిందని మహాలక్ష్మీ స్పష్టం చేశారు. ఒక్క సత్తుపల్లిలోనే రూ.125 కోట్లకు పైగా అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న రోజుల్లో సత్తుపల్లిని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ప్రాంతంగా సండ్ర తీసుకురానున్నారని ఆమె అన్నారు. సండ్రను నాలుగోసారి అసెంబ్లీకి పంపించేందుకు అమూల్యమైన ఓటును కారు గుర్తుపై వేసి భారీ మెజారిటీతో సండ్రను గెలిపించాలని మహాలక్ష్మి ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్ చాంద్‌పాషా, నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలి

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

నవతెలంగాణ- ఖమ్మం



సీపీఐ(ఎం) అభ్యర్థుల విజయానికై కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి యర్రా శ్రీకాంత్ విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ ఖమ్మం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో రెండు కార్పొరేట్‌శక్తులు ఎన్నికలలో డబ్బుతో గెలవాలని చూస్తున్నారని, వారు ఎప్పుడైన ప్రజా సమస్యలపై పోరాడేరా అని ప్రజలు ఆలోచించి నిత్యం ప్రజల కోసం కార్మికుల కోసం పనిచేస్తున్న సీపీఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్‌ని గెలిపించాలని, కార్యకర్తలు బూత్‌ల వారీగా సీపీఎం అభ్యర్థుల విజయానికై సైనికుల్లాలాగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకోసం పనిచేస్తు, ఎప్పుడు ఎవరికి ఏ సమస్య వచ్చినా నీకు అందుబాటులో సీపీఎం అభ్యర్థి ఉన్నాడని తెలిపారు. ఖమ్మంలో యర్రా శ్రీకాంత్ గత నలభై ఐదు సంవత్సరాల నుంచి సిపిఎంలో ఉంటూనే అనేక పోరాటాలు ప్రజల సమస్యల కోసం కృషి చేశారని తెలిపారు. సీపీఎం అభ్యర్థులను గెలిపిస్తే అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై పోరాడుతారని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, నాయకులు యర్రా శ్రీనివాసరావు, యం.ఎ.జబ్బార్, యస్.నవీన్‌రెడ్డి, షేక్.మీరా, బోడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీను, దొంగల తిరుపతి రావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో ఎర్రజెండా ఎగరడం ఖాయం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకట్

నవతెలంగాణ -కూసుమంచి



పాలేరు నియోజకవర్గంలో సీపీఐ(ఎం) పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం విజయంతో పాలేరు నియోజకవర్గంలో ఎర్రజెండా ఎగరడం ఖాయమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకట్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని మల్లెపల్లి గ్రామంలో కూసుమంచి, నేలకొండపల్లి మండల కమిటీ సభ్యుల సంయుక్త సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గ కమ్యూనిస్టు పార్టీలకు బలమైన కేంద్రమని, ఎన్నో ఉద్యమాలకు ఊపిరినిచ్చిన గడ్డ పాలేరు అని, చట్టసభల్లో ఎర్రజెండాను నిలపాలని, ప్రజా గొంతుకై వినిపించేది ఒక ఎర్రజెండా పార్టీనే, అది ముఖ్యంగా తమ్మినేని వీరభద్రంతోనే సాధ్యమని ప్రజలు అభిప్రాయపడుతున్నారని, ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు రాజకీయాలు చేస్తూ, ప్రజల ఓట్లతో గద్దనెక్కుతున్నారని, గెలిచిన వెంటనే ఓట్లను, ప్రజలను అపహాస్యం చేస్తూ,, బడ కాంట్రాక్టర్లు రాజకీయ నాయకులు అయినప్పుడు తమ స్వార్థాల కోసం పార్టీలు మారి వేలకోట్ల కాంట్రాక్టు పొంది, ఎన్నికలను అపహాస్యం చేస్తున్నారని, అలాంటి రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తున్నారని, ప్రజా సమస్యల కోసం, నిరంతరం కార్మిక, కర్షక వర్గాల ప్రజల కోసం తమ గొంతునెత్తి ప్రజా సమస్యల పరిష్కరణకై నిరంతరం పోరాడుతున్న ఎర్రజెండా పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారని, ప్రజా సమస్యలపై పోరాడే గొంతుకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించి అసెంబ్లీకి పంపాలని ప్రజలు తమ మనోభావాలను వ్యక్తపరుస్తున్నారని, ముమ్మాటికి పాలేరు ఎర్రజెండా ఎగరటం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాలేరు డివిజన్ ఇన్చార్జి బండి రమేష్, మండల ఇంచార్జ్ బుగ్గవీటి సరళ, నేలకొండపల్లి మండల కార్యదర్శి కె.వి.రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు ఎర్రబొయిన భారతి, జోన్ కన్వీనర్లు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తమ్మినేనిని గెలిపించండి

సీపీఐ(ఎం) శ్రేణుల ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

పాలేరు సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమ్మినేని వీరభద్రంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సీపీఐ(ఎం) శ్రేణులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఎం.వెంకటాయపాలెం, తల్లంపాడు, కాచిరాజుగూడెం, మద్దులపల్లి, తెల్దారుపల్లి, పొన్నెకల్లు, ఏదులాపురం, పోలేపల్లి, ముత్తగూడెం, ఆరేకోడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎం.వెంకటాయపాలెం గ్రామంలో తమ్మినేని వీరభద్రం తనయుడు సంఘమిత్ర ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటేయ్యాలని ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. ప్రహరీ పని జరుగుతుండడంతో ఇటుకల పేర్చి పలువురిని ఆకట్టుకున్నాడు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు బత్తినేని వెంకటేశ్వరరావు, సిద్ధినేని కోటయ్య, సిపిఎం నాయకులు నంద్ర ప్రసాద్, ఉరడీ సుదర్శన్‌రెడ్డి, నందిగామ కృష్ణ, పి.సంగయ్య, పి.మోహన్‌రావు, తమ్మినేని వెంకట్రావు, కోటి శ్రీనివాస్, యామిని ఉపేందర్, పొన్నం వెంకటరమణ, సిలువేరు బాబు, వడ్లమూడి నాగేశ్వరరావు, పాపిట్ల సత్యనారాయణ, జక్కంపూడి నాగేశ్వరరావు, వట్టికోట నరేష్, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) అభ్యర్థి భూక్యా విస్తృత ప్రచారం

నవతెలంగాణ-కొణిజర్ల

వైరా నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి భూక్యా వీరభద్రం శనివారం మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆటో మొబైల్ షాప్‌లో బైక్ రిపేర్ చేస్తూ వర్క్ షాప్‌లో ఉన్నటువంటి మెకానిక్‌లను కలిసి తనను గెలిపించాలన్నారు. అనంతరం బస్వాపురం, బొట్లకుంట గ్రామాల్లో ప్రచారం చేసి ఏన్కూరు, జూలూరుపాడు మండలాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, మండల కమిటీ సభ్యులు అన్నవరపు వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి సాయి,సైదా నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌మయమైన చింతలతండా

నవతెలంగాణ- ఖమ్మం

కూసుమంచి మండలం చింతలతండా గ్రామం అంతా కాంగ్రెస్ మాయమైంది. ఇటీవలే కేశ్వాపురం గ్రామపంచాయతీ ఇంచార్జ్ సర్పంచ్ దరావత్ కోటమ్మ, భద్రు దంపతులతో పాటు మరికొంత మంది వార్డు సభ్యులు కాంగ్రెస్‌లో చేరగా శనివారం ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో సర్పంచ్ కోటమ్మ క్లస్టర్ ఇంచార్జ్ పెండ్ర అంజయ్య, సీడీసీ మాజీ ఛైర్మన్, మాజీ ఎంపీపీ జూకూరి గోపాల్ రావు ఆధ్వర్యంలో చింతలతండా బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో భారీగా ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

సీపీఐ(ఎం) అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- **జిల్లా కార్యదర్శి కనకయ్య**

నవతెలంగాణ-ములకలపల్లి



అశ్వారావుపేట నియోజకవర్గ సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి కామ్రేడ్ పిట్టల అర్జున్ గెలుపు కోసం కార్యకర్తలందరూ సైనికుల వలే పనిచేయాలని, గ్రామ గ్రామన, వాడ, వాడన ప్రతి ఇంటికి వెళ్ళి ప్రచారం విస్తృతంగా నిర్వహించలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ మండల కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రజా పోరాటాలు ఉద్యమాలు నిర్వహించే కమ్యూనిస్టులకు ఓట్లు వేసి అసెంబ్లీకి పంపించాలని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పోడు భూముల పోరాటాలు నిర్వహించి పార్టీ కార్యకర్తల పై అనేక కేసులు జైలు జీవితాము గడిపారని, పోడు సాగుదారులందరికీ పార్టీ నిర్వహించిన పోరాటాల ఫలితంగానే హక్కుపత్రాలు వచ్చాయని అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గం అభివృద్ధి జరగాలి అంటే సీపీఐ(ఎం)తోనే సాధ్యం అవుతుందని అన్నారు. ఐదు సంవత్సరాల పాటు గ్రామాలలో ఎన్నడు ప్రజా సమస్యలు పట్టని అవకాశవాద కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజా, కార్మిక వర్గ పోరాటాల నేత పార్టీ అభ్యర్థి పిట్టల అర్జున్‌ను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు పై ఓట్లు వేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుకను అసెంబ్లీకి పంపించాలని అన్నారు. ఈ కార్యకమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎమ్. జ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, పొడియం వెంకటేశ్వర్లు, రవికుమార్, ఆదినారాయణ, నాగేశ్వరరావు, రావుజా, వీరస్వామి, నిమ్మల మధు, లక్ష్మీ ననర్సయ్య, రామ్మూర్తి, వెంకటనర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఓటరు తుది జాబితా విడుదల

- **1095 పోలింగ్ కేంద్రాల్లో 966439 మంది ఓటర్లు**
- **471745 పురుషులు, 494650 మంది మహిళలు**
- **జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అలా**

నవతెలంగాణ-పాల్వంచ



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అలా శనివారం జిల్లా ఓటరు తుది జాబితా విడుదల చేశారు. ఈ నెల 30వ తేదీన జరుగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో గత నెల 4వ తేదీన ఓటరు జాబితా ప్రకటించామని, తదుపరి ఎన్నికల సంఘ మార్గదర్శకాల మేరకు అక్టోబర్ 31వ తేదీ వరకు నూతన ఓటర్లు నమోదుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలోని ఐదు నియోజకర్గాల పరిధిలో ఉన్న 1095 పోలింగ్ కేంద్రాల్లో 966439 మంది ఓటర్లున్నట్లు చెప్పారు. వీరిలో 471745 మంది పురుషులు, 494650 మంది మహిళలు, ఇతరులు 44 మంది ఉన్నట్లు ఆమె చెప్పారు. నూతనంగా ఓటు హక్కు నమోదు చేసుకున్న వారందరు ఈ నెల 30వ తేదీన జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. నూతనంగా ఓటు హక్కు. పొందిన వారిని అలాగే ఓటరు నమోదులో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ ఆమె అభినందించారు.

గులాబీ జెండా వెంట యావత్ ప్రజానీకం

- **కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు కుటుంబాలు బీఆర్ఎస్ చేరిక**

నవతెలంగాణ-బూర్గంపాడు



బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి కోనేరు సత్యనారాయణ (చిన్ని)ల సమక్షంలో అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మండలంలోని వివిధ ప్రాంతాలకు నుంచి కాంగ్రెస్ పార్టీ చెందిన పలు కుటుంబాలు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ అధ్యక్షులు బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, యువజన విభాగ మండల అధ్యక్షులు గోనెల నాని, మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, మాజీ ఎంపీటీసీ బాలి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే బీఆర్ఎస్ పార్టీలో చేరాం

- **ఎమ్మెల్యే హరిప్రియను భారీ మెజార్టీతో గెలిపించాలి**
- **ఆత్మీయ సమ్మేళనంలో మడత రమ వెంకట గౌడ్ దంపతులు**

నవతెలంగాణ-ఇల్లందు



పట్టణ అభివృద్ధి కోసమే హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రలకు సమక్షంలో చేరినట్లు మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్మెన్ మడత రమ వెంకట గౌడ్ దంపతులు పేర్కొన్నారు. స్థానిక ఏక్తా హౌస్‌లో శనివారం అభిమానుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని 24 వార్డుల మాజీ మున్సిపల్ కౌన్సిలర్తోపాటు వార్డు ప్రజలు సుమారు 2000 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వారు పాల్గొని ప్రసంగించారు. 2014లో మున్సిపల్ చైర్ పర్సన్‌గా మడత రమ వెంకట గౌడ్ ఉన్న సమయంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ సహకారంతో రూ.120 కోట్ల అభివృద్ధి పనులు నిర్వహించామన్నారు. 50 ఏండ్లలో ఇంత అభివృద్ధి ఎన్నడూ జరగలేదన్నారు. రాష్ట్రంలో ఒక పార్టీ అధికారంలోకి వస్తే మరో పార్టీ ఇల్లందులో ప్రత్యక్షంగా ఉంటుందన్నారు. దీన్ని నివారించడానికి ప్రజలంతా తమ ఓటుక్కును వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే పార్టీని గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన అనంతరం పట్టణాన్ని మరో రూ.200కోట్లతో అభివృద్ధి చేసున్నట్లు పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే హరిప్రియను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మల్లేష్ యాదవ్, చంద్రమౌళి, కమల్ కుమార్ కోరి, సిహెచ్ రమేష్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో రేగా చెరగని ముద్ర

- **రేపు సీఎం ఆశీర్వాద సభ**

నవతెలంగాణ-మణుగూరు





పోడు భూములకు పట్టాలు ఇవ్వడంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు కీలక పాత్ర వహించారు. రాష్ట్రంలో మొత్తం 4 లక్షల ఎకరాలకు పట్టాలు ఇస్తే, ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,51, 195 వేల ఎకరాలకు గాను 55 వేల రైతు కుటుంబాలకు పట్టాలను ఇప్పించారు. పినపాక నియోజకవర్గంలో 15,962 మంది పోడు రైతులకు 52,438 ఎకరాలకు రేగా కాంతారావు పోడు పట్టాలు పంపిణీ చేశారు. పోడు పట్టాలతో పాటు వారికి ధరణిలో పేరు ఎక్కడం, పాస్ బుక్ రావడం, ఎకరాకు 10 వేలు రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్‌తో పాటు 24 గంటలు సరఫరా, వంటి పథకాలు అమలు అయ్యేలా రేగా కాంతరావు అహర్నిశలు కృషి చేశారు. పినపాక, కరకగూడెం, ఆళ్లపల్లి, గుండాల వంటి ప్రాంతాల్లో కోట్లాది నిధులు వెచ్చించి వాగులు, వాంకలపై బ్రిడ్జీలను ఏర్పాటు చేశారు. మణుగూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రత్యేక నిధులు కేటాయిస్తూ, ప్రధాన రహదారిని డివైడర్లు, సెంట్రల్ లైటింగ్‌తో సుందరంగా తీర్చిదిద్దారు.

పులుసు బొంత కల సాకారం

పులుసుబొంత ప్రాజెక్ట్ కోసం అహర్నిశలు శ్రమిస్తూ, ప్రభుత్వం జీవో విడుదల చేసేలా ప్రత్యేక కృషి చేశారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే రెండు వేల ఎకరాలకు, రెండు పంటలకు సరిపడా సాగునీరు భూగర్భ జలాలు పెరుగుతాయి. గోదావరి పరివాహక ప్రాంతం కావడం తో లిఫ్టులు,చెక్ డ్యాములకు ప్రాధాన్యత ఇస్తూ, ఎత్తిపోతల పథకాలను శంకుస్థాపనలు చేసి ప్రారంభించారు.



ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేగా కాంతారావు

మణుగూరులో నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భూములు కోల్పోయిన భూనిర్వాసితులు 356 మందికి ఉద్యోగాలను ఇప్పించడంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక కృషి చేశారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల వైద్యసేవలు అందిస్తున్నారు.



కూనంనేని గెలుపుకోసం సమిష్టిగా శ్రమిద్దాం

- **సీపీఐ(ఎం), సీపీఐ నాయకులు**

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం నియోజకవర్గానికి ప్రజా ప్రతినిధిగా కూనంనేని సాంబశివరావు సేవలందించాలిసిన అవసరాలు ఏర్పడ్డాయని, గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో ప్రచార ఆర్భాటాలు మినహా జరిగిన అభివృద్ధి శూన్యమని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. విద్యానగర్ కాలనీ, లెనిన్ నగరాలలో వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో నాయకులు మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో అరాచక పాలన అంతం చేసేందుకు విపక్షాలు ఏకతాటిపైకి వచ్చాయన్నారు. మోడీ, కేసీఆర్ అంతర్గత దోస్తు కట్టి మరోసారి దేశాన్ని, రాష్ట్రాన్ని దివాళా తీయించేందుకు కుట్ర చేస్తున్నాయని అన్నారు.

2009 ఎన్నికల ఫలితాలు పునరావృతం అయ్యే విధంగా కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం), టీజెఎస్, ప్రజాపంథా శ్రేణులు కృషిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశాల్లో సీపీఐ(ఎం), సీపీఐ నాయకులు అన్నవరపు సత్యనారాయణ, లక్ష్మణ్, శ్రీనివాసరెడ్డి, వాసిరెడ్డి మురళి, భాగం మాధవరావు, కంచర్ల జమలయ్య, మహేశ్వరరావు, గెద్దాడ నగేష్, రామకృష్ణ, శ్యామ్, నాగరాజు, ఖదీర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | నవంబర్ 12 2023 www.navatelangana.com

సీఎం సభకు భారీగా జన సమీకరణ చేయాలి

- ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి
- విప్ రేగా కాంతారావు



నవతెలంగాణ-బూర్గంపాడు

సీఎం కేసీఆర్ సభకు భారీగా జన సమీకరణ చేయాలని, ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో శనివారం రేగా పినపాక నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ కోనేరు సత్యనారాయణ (చిన్ని)లు ఎన్నికల ప్రచారంలో భాగంగా వందమంది బూత్ కమిటీ సభ్యులు కోఆర్డినేటర్లతో పార్టీ ప్రజా ప్రతి నిధులు ముఖ్యనాయకులతో, ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ తేదీన బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యల అభిమానులు వచ్చేందుకు సన్నద్ధమవుతున్నారని ఆయన అన్నారు. బూత్ కమిటీ సభ్యులు, కోఆర్డినేటర్లు ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమన్వయం చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో పినపాక నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి ప్రజల ముందుకు వస్తున్నానని ఆయన అన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి సుమారు 60 వేల మంది జనాభా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అమలు చేయని సంక్షేమ పథకాలు ఒక తెలంగాణలోనే అమలవుతున్నాయని ఆయన అన్నారు. పథకాలను ఇంటింటికి తీసుకువెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ అధ్యక్షులు బిక్కసాని శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గోనెల నాని, మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ పోడియం ముత్యాలమ్మ, మాజీ జెడ్పీటీసీ భూపల్లి నరసింహారావు, పార్టీ జిల్లా నాయకులు కామిరెడ్డి రామ కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రశ్నించే గొంతుకులను చట్టసభల్లోకి పంపించండి

నవతెలంగాణ-జూలూరుపాడు

ప్రశ్నించే గొంతుకులను చట్టసభల్లోకి పంపించాలని వైరానియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి భూక్య వీరభద్రం అన్నారు. మండలంలోని లోపల మాచినపేట, నరసాపురం, పాపకొల్లు గ్రామాలలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎం) పేదల పార్టీ అని, ఎన్నికల గుర్తు సుత్తి కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నినాదాలు చేశారు. కొంత మంది డబ్బు సంచులతో ఓట్లు కొనేందుకు వస్తున్నారని, అటువంటి వారి వద్ద డబ్బు తీసుకుని నికార్సైన కమ్యూనిస్టులకు ఓటు వేయాలని కోరారు. కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉండటం ద్వారా చట్టసభలకు గౌరవం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి యాస నరేష్, పార్టీ మండల కమిటీ సభ్యులు లాకావత్ శ్రీను, ఊడల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షల బాకీ ఇవ్వకుండా బెదిరింపుల గురి చేస్తున్నారు

- ఏమైనా హాని జరిగితే ఎమ్మెల్యే హరిప్రియ హరిసింగ్‌లదే బాధ్యత
- విలేకరుల సమావేశంలో బాధితుడు శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఇల్లందు

భూమి పత్రాలు తానఖా పెట్టి అప్పుగా తీసుకున్న రూ.25 లక్షలు ఇవ్వకుండా ఎమ్మెల్యే హరిప్రియ భర్త హరిసింగ్ నాయక్ బెదిరింపులకు గురి చేస్తున్నారని గడిపర్తి శ్రీనివాసరావు, ఆయన భార్య రమ, ఆయన బావ ప్రసాద్ తదితరులు ఆరోపించారు. స్థానిక కాకతీయ నగర్‌లోని ఆయన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహబూబాబాద్‌లో భూమి కొందామని హర్సింగ్ నాయక్, మూడు బాలు, తాత గణేష్ బాధితుడు గడిపర్తి శ్రీనివాసరావులు కలిసి 2 ఎకరాలు కొన్నామని తెలిపారు. 2019లో నలుగురిని పిలిచి నాకు డబ్బు అవసరం ఉందని రెండు కోట్లకు హర్షింగ్ కుదవ పెట్టుకుంటానని మళ్లీ విడిపిస్తానని అందరి సంతకాలు పెట్టుకుని రూ.2 కోట్లు వాడుకున్నారని తెలిపారు. ఈ విషయమై మంత్రి సత్య రాథోడ్, ఎంపీ కవిత, వద్దిరాజు రవిచంద్రలు, ఎమ్మెల్యే హరిప్రియ సమక్షంలో లెక్కచేసి రూ.60 లక్షలు ఇవ్వాల్సి వస్తాయనే వీటికి సంబంధించి అగ్రిమెంట్ రాసిచ్చారని తెలిపారు. రూ.30 లక్షలు ఇచ్చారని మరో 25 లక్షలు బాకీ అలాగే ఉందని, ఇవ్వడం లేదని తెలిపారు. అడిగితే బూతులు తిడుతూ బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు బాలు, తాత గణేష్ ఇద్దరూ హరి సింగ్ నాయక్ చర్యలకు మద్దతు తెలుపుతూ గతంలో ఒకరిని లారీ గుద్దిన ప్రమాదకర సంఘటన ఉందని జాగ్రత్తగా ఉండాలనే బెదిరింపుల గురి చేస్తున్నారని తెలిపారు. ఇదే విషయమై రాజ్యసభ సభ్యుల వద్దిరాజు సంప్రదించగా నేనేం చేయాలి అంటున్నారని తెలిపారు. ఏమైనా హాని జరిగితే ఎమ్మెల్యే హరిప్రియ హరిసింగ్ నాయకుల బాధ్యత అని తెలిపారు.



రేగళ్ల ఏజెన్సీలో కూనంనేని విస్తృత ప్రచారం

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం నియోజక వర్గం సీపీఐ, కాంగ్రెస్, సీపీఐ(ఎం), టీజెఎస్ శ్రేణులు ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావు లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని రేగళ్ల, మైలారం, బంగారు చెలక, గట్టుమల్ల, పరిసర ఏజెన్సీ గ్రామాల్లో శనివారం పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. గ్రామాల పొలిమేరల్లో మహిళలు, యువకులు కూనంనేనికి తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో ఏజెన్సీలో చేసిని అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేసి ఇంటింటికీ తిరిగి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లలో జరిగిన సమావేశాల్లో కూనంనేని మాట్లాడారు. మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతూ కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ళ పాలనా సాగించారని, కేసీఆర్ మాయ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చగలిగే సత్తా వున్న కాంగ్రెసును అధికారంలోకి తెచ్చేందుకు, కొత్తగూడెంను అభివృద్ధి చేసుకునేందుకు కంకి కొడవలి గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తూము చౌదరి, దయానంద్, పూనెం శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంటెం సత్యనారాయణ, దీటి లక్ష్మీపతి, శ్రీనివాస్, వసంత రావు, లింగయ్య, మోహన్, సర్వాన్ రాజు, ప్రభు, కంటెం శేఖర్, రామయ్య, సుధాకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-మణుగూరు

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్ డిమాండ్ చేశారు. శనివారం పీవీ కాలనీ రామాలయం సెంటర్లో సింగరేణి పనిచేస్తున్న కాంట్రాక్ట కార్మికుల సమస్యలు మాట్లాడుతూ ఈ నెల 30వ తారీకు జరుగు అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తుందని వెలగపల్లి జాన్ వైస్ ప్రెసిడెంట్ ఐఎన్టీయూసీ మణుగూరు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ (ఐ) పార్టీ అధికారంలో వచ్చినట్లయితే కాంట్రాక్ట్ కార్మికులకు రావాల్సిన సమాన పనికి సమాన వేతనం ఇచ్చే విధంగా బి.జనక్ ప్రసాద్ నాయకత్వంలో ప్రతి కార్మికులకు నెలకు జీతం రూ.26 వేల వేతనాలు అందిస్తామన్నారు. కార్మికులందరూ కాంగ్రెస్(ఐ) పార్టీని గెలిపించాలన్నారు. అతి రామ్, ఇమాంబి, ఇతరులు నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాని పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే శూన్యమే

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వనమా

నవతెలంగాణ-కొత్తగూడెం



అధికారంలోకి రాని పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి శూన్యమేనని అటువంటి అభ్యర్థులకు ఓటు వేసి ఓటును వృధా చేసుకోవద్దని కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు ఓటర్లకు సూచించారు. ఈ నెల 30న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నియోజకవర్గంలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. శనివారం చుంచుపల్లి మండలంలోని పెనుబల్లి, ప్రశాంతినగర్, గరిమెళ్ళపాడు పంచాయతీలలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో వనమా మాట్లాడారు. నామీద పోటీ చేసే అభ్యర్థులు ఎన్ని కప్పగంతులు వేసిన గెలవలేరని ప్రజల ఆదరభిమానాలు తనకే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

నిప్పులాంటి సీపీఐ(ఎం) కార్యకర్తలను కొనలేరు

- బలవంతంగా పార్టీలోకి రావాలని బెదిరిస్తే ఖబడ్దార్
- పార్టీ మండల కార్యదర్శి నిమ్మల వెంకన్న

నవతెలంగాణ-పినపాక

సీపీఐ(ఎం) పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజా ప్రతినిధులను బలవంతంగా పార్టీలోకి రమ్మంటూ ప్రలోభాలకు గురి చేస్తే ఖబర్దార్ తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని పార్టీ మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న మండిపడ్డారు. శనివారం ఆయన పినపాక మండలం జానంపేట గ్రామపంచాయతీ దుబ్బగుంపులో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. పార్టీ వార్డు మెంబర్ల ఇంటికి వెళ్లి జెండాలు కప్పి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫోటోలు వివిధ గ్రూపుల్లో పంపుతున్నారని ఈ పరిణామాలు సరైన పద్ధతి కాదన్నారు. దుబ్బ గుంపు వార్డు మెంబర్ రవి తమ పార్టీలోకి వచ్చారని కాంగ్రెస్ నాయకులు వివిధ గ్రూపుల్లో పెట్టడం, ప్రచారం చేయడంపై ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఎలా ఓడించాలో సీపీఐ(ఎం) పార్టీకి తెలుసు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గోవర్ధన్, మడివి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్‌లో త్రివేణి విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెంలో నిర్వహించిన సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో త్రివేణి విద్యార్థులు శనివారం ప్రతిభ చాటారు. ఈ ఏడాది జిల్లా స్థాయిలో నిర్వహించిన 31వ నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్-2023లో త్రివేణి పాఠశాలకు చెందిన విద్యార్థులు పి.శిశిర, ఎం.సహస్ర జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన చేశారు. "మనిషి జీవనానికి ఆరోగ్యమే మహా భాగ్యం" అని ఆరోగ్యానికి ప్రధానమైన పోషక విలువలలో "విటమిన్ బి-12, విటమిన్ డి-లోపాల గురించి ఎంతో చక్కగా వివరించి మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని త్రివేణి పాఠశాలల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఓ. కాట్రగడ్డ మురళి కృష్ణ, ప్రిన్సిపాల్స్ వైవి. సురేష్, శ్రీనివాస్ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భద్రాచలంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక భద్రాచలంలోని బస్టాండ్ వెనుక గల వ్యాపార వర్తకులను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య ఎన్నికల గుర్తు హస్తం పై ఓటు వేసి భద్రాచలం అభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలని నాయకులు ఓటర్లను కోరారు. అధికార మదంతో కళ్ళు నెత్తికెక్కిన సీఎం కేసీఆర్ ఆనవాయితీగా భద్రాద్రి రామయ్య కళ్యాణానికి తెచ్చే పట్టు వస్త్రాలు కూడా తేవడం మరిచారని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ ప్రచారంలో సభ్యులు బుడగం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, బ్లాక్ అధ్యక్షులు బలుసు నాగ సతీష్, వెంకన్న, సత్తిలింగం, వీరబాబు, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, రాంప్రసాద్, సిద్ధి గణేష్ తదితరులు పాల్గొన్నారు.





ఐదు నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్లు నియామకం

- **జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అలా**

నవతెలంగాణ-పాల్వంచ

కొత్తగూడెం, ఇల్లందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్స్‌గా కమల్ కిశోర్, హరి కిషోర్, గణేష్ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షణకు నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. కొత్తగూడెం సాధారణ పరిశీలకులు కమల్ కిషోర్ సింగరేణి విశ్రాంతి భవనం (ఇల్లందు గెస్ట్ హౌస్) పని దినములలో సాయంత్రం 4.00 గం. నుండి 5.00 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. 6303743371 కాల్ చేసి సమాచారాన్ని అందించవచ్చని చెప్పారు. ఇల్లందు, పినపాకలకు సాధారణ పరిశీలకులుగా నియమితులైన హరి కిషోర్ ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు ఐటీసీ విశ్రాంతి భవనం, సరపాక, బూర్గంపాడు మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. 6303713285 నంబర్‌కు కాల్ చేసి సమస్యలను తెలియచేయాలని చెప్పారు. అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకులుగా నియమితులైన ఎస్.గణేష్ సింగరేణి విశ్రాంతి భవనం, (ఇల్లందు గెస్ట్ హౌస్) నందు సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు అందుబాటులో ఉంటారని చెప్పారు. 6303715534 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆమె చెప్పారు.

రేగళ్లలో జలగం ప్రచారం

నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి



కొత్తగూడెం నియోజకవర్గం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఎమ్మెల్యే అభ్యర్థి జలగం వెంకటరావు లక్ష్మీదేవిపల్లి మండలం పరిధిలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శనివారం ఆయన తన అనుచర గణాన్ని కలిసి వారి ద్వారా ప్రచారం నిర్వహించారు. ముందుగా గతంలో తన మిత్రులు, ఆయన వెంట పార్టీలో పనిచేసిన పార్టీ శ్రేణులను కలిశారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న పలువురు నాయకులను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. వారి ఇంటికి నేరుగా వెళ్లి కలుసుకొని మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో కనీసం రోడ్డు సౌకర్యాలు కూడా లేక పోవడం పట్ల విచారణ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సకినాల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

దీపావళి పండుగ శుభాకాంక్షలు

- **కలెక్టర్ ప్రియాంక అలా**

నవతెలంగాణ-పాల్వంచ



జిల్లా ప్రజలకు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వెలుగుల పండుగ అందరి జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. చిన్నారులు బాణసంచాలు కాల్చుటలో తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. పెద్దల సమక్షంలో మాత్రమే తక్కువ శబ్దం వచ్చేవి, చిన్నారులకు ప్రమాదం వాటిల్లనివి మాత్రమే కాల్చాలని చెప్పారు. ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందపు వెలుగులు నింపాలని చెప్పారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

భద్రాచలం రూరల్ : భద్రాచలం ఆయుర్వేద దినోత్సవాన్ని భారత ప్రభుత్వంలోని ఆయుష్ మంత్రిత్వ శాఖ శనివారం సిఆర్పి ఎఫ్ బెటాలియన్ ఎటపాకలో నిర్వహించింది. ఆయుష్మాన్, భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సిఆర్పిఎఫ్ 212 బెటాలియన్ హెడాక్వార్టర్స్ బ్యానర్పై దీపక్ కుమార్ శ్రీవాస్తవ, కమాండెంట్ 212 బెటాలియన్ అజయ్ ప్రతాప్ సింగ్, డిప్యూటీ కమాండెంట్, అధికారులు, సైనికులు ఆయుర్వేద దినోత్సవం రోజున సమావేశమై ప్రాముఖ్యత గురించి చెప్పారు. రోజువారీ ఆహార పదార్థాలు ఆయుర్వేద రూపంలో మన ఆరోగ్యానికి నిరంతరం దోహదం చేస్తాయని తెలిపారు. ఆయుర్వేద మొక్కలను పంపిణీ చేశారు.

తండ్రి గెలుపు కోసం తనయుడు ప్రచారం

గడపగడపకు తుమ్మల యుగంధర్

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని 57 డివిజన్‌లో తుమ్మల నాగేశ్వరరావు గెలుపు కోసం తనయుడు నగరంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. శనివారం ఖమ్మం నగర 57 డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ అనే నినాదంతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా టూ టౌన్ కాంగ్రెస్ నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలను స్థానిక ప్రజానీకానికి వివరించారు. ఈ సందర్భంగా తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా తుమ్మల నాగేశ్వరరావు రాజకీయాల్లో ఉన్నారని, కానీ ఏనాడు కూడా చందా, దందాలకు పాల్పడలేదన్నారు. గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా, ఆయా గ్రామాలకు మౌలిక వసతులు ఏర్పాటు చేశారుని అన్నారు. ఖమ్మం నగరంలో ప్రస్తుతం బీఆర్ఎస్ కార్యకర్తలు విచ్చలవిడిగా దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ ఉమ్మడి జిల్లాలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేయని శంకుస్థాపన లేదని, ప్రస్తుత నాయకులు బావిలో కప్పలాగా ఒక ప్రాంతానికి పరిమిత అయ్యారని అన్నారు. కానీ తుమ్మల నాగేశ్వరరావు అందరివాడు అని, అందుకోసమే ఉమ్మడి జిల్లా మొత్తం తన కుటుంబ సభ్యులు అని భావించి నలుదిక్కుల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని యుగంధర్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ప్రతి పేదవాడి కలను సహకారం చేయడంలో తుమ్మల కీలకపాత్ర వహిస్తారని అన్నారు. కార్యక్రమంలో మహమ్మద్ రఫీదా బేగం, ముస్తఫా, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పోరాడిన కొత్త జగ్గయ్య

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మద్దినేని రమేష్, మాచర్ల భారతి

నవతెలంగాణ- వేంసూరు



పార్టీ పట్ల అంకితభావంతో తుది శ్వాస విడిచే వరకు అంకితభావంతో పనిచేసిన వ్యక్తి కొత్త జగ్గయ్య అని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మద్దినేని రమేష్, మాచర్ల భారతి అన్నారు. శనివారం లింగపాలెంలో కొత్త జగ్గయ్య నివాసంలో అరవపల్లి జగన్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో మాట్లాడుతూ కొత్త జగ్గయ్య నాడు నైజాంకు వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహించడం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ చురుకుగా పనిచేశారని అన్నారు. నేడు మహిళలపై దాడులు పెరిగాయని, పాలకపక్షాలకు పట్టడం లేదని ఐద్వా ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తున్నామని సత్తుపల్లి నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి మాచర్ల భారతి అన్నారు. చలమాల విఠల్ మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి ఒక్క కార్యక్రమంలోనూ చురుకుగా పాల్గొనే వారని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు. పాకలపాటి ఝాన్సీ, మల్లూరి చంద్రశేఖర్, మోరంపూడి వెంకటేశ్వరరావు, కొత్త సత్యనారాయణ, మామిళ్ళ వెంకటేశ్వరరావు, రావుల రాజబాబు, సుదర్శన్, గడిపర్తి మోహన్‌రావు, ఎలిగినేని రాంబాబు, మాచర్ల గోపాల్, ఎర్ర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సత్తుపల్లి ప్రజలు సండ్రను గెలిపించుకు తీరతారు

- ఇంకొకరికి ఓట్లేసే అవకాశం ఉండనే ఉండదు
- శ్రమించే సండ్ర లాంటి వ్యక్తి మనకవసరం
- రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి
- తెలంగాణ రాకముందు ఇన్ని పథకాలు ఎక్కడివి
- సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ-సత్తుపల్లి



కాలికి బలపం కట్టుకొని విశ్రాంతి లేకుండా ప్రజల కోసం కష్టపడే నిరంతర శ్రామికుడు సండ్ర వెంకటవీరయ్యను నియోజకవర్గ ప్రజలు గెలిపించుకు తీరతారని రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని గౌరిగూడెం, సిద్ధారం, సదాశివునిపాలెం, కొత్తూరు గ్రామాల్లో సండ్ర విజయాన్ని కాంక్షిస్తూ ఆయా గ్రామాల ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో పార్థసారధిరెడ్డి మాట్లాడారు. ఈ 15 యేండ్లుగా నియోజకవర్గ ప్రజలను అంటిపెట్టుకొని మీ కుటుంబ సభ్యుల్లో ఒకడిగా సండ్ర వ్యహరిస్తున్నారన్నారు. తెలంగాణలో ఉన్న 119 ఎమ్మెల్యేలలో సీఎంతో అతి చనువుగా ఉండే 10 మందిలో సండ్ర మొదటివారన్నారు. ముఖ్యమంత్రితో కొట్లాడి మరీ సత్తుపల్లికి అభివృద్ధి ఫలాలను తీసుకొచ్చే దమ్మున్న ఎమ్మెల్యే సండ్రేనన్నారు. అలాంటి వ్యక్తిని కాదని వేరొకరికి ఓట్లేసే పరిస్థితి సత్తుపల్లి నియోజకవర్గంలో ఉండనే ఉండదన్నారు. కార్యకర్తలా పనిచేసే సండ్ర లాంటి వ్యక్తి మనకు అవసరమన్నారు. ఇన్నేసిసార్లు ఒక ఎమ్మెల్యే ఒక గ్రామానికి వందలాది సార్లు వచ్చిన ఉదంతాలు మనం ఎప్పుడూ చూసుండమన్నారు. ఇంతకు ముందు మీకు సండ్ర ఒక్కడేనని, ఇప్పుడు నేను ఓ అన్నలా ఆయనకు తోడుండి ఈ ప్రాంత అభివృద్ధిలో నా వంతు కృషికూడా ఉంటుందని డాక్టర్ బండి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రోజూ ఏదోఒక సమయంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై ఆలోచన చేస్తూనే ఉంటారన్నారు. దేశంలో ఎక్కడాలేని పథకాలన్నీ తెలంగాణలో విజయవంతంగా అమలు జరుగుతున్నా యన్నారు. తెలంగాణ రాకముందు, వచ్చాక జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరు మనసుపెట్టి ఆలోచన చేయాలన్నారు. 13యేండ్ల ఉద్యమం చేసి తెలంగాణను తీసుకొచ్చిన కేసీఆర్ తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా తీసుకురావాలనే గురుతర బాధ్యత ఉంది కాబట్టే ఇన్ని పథకాలను తీసుకొచ్చారన్నారు. అభివృద్ధి ఇంతటితో ఆగపోవద్దన్నారు. కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్నారు. అందుకే మనం కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయాలంటే సత్తుపల్లిలో సండ్రను అత్యధిక ఓట్లతో గెలిపించేందుకు కారు గుర్తుపై ఓట్లెయ్యాలని బండి కోరారు.

తెలంగాణ రాకముందు ఇన్ని పథకాలు ఎక్కడివి
: బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య

తెలంగాణ రాకముందు ఇన్ని పథకాలు ఎక్కడున్నాయని బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర అన్నారు. 11సార్లు ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశ ఇచ్చినా ప్రజలకు మేలుజరిగే కార్యక్రమాలేవీ తీసుకురాలేదన్నారు. పైగా ఒక్క అవకాశం ఇవ్వండని ప్రజలను కాంగ్రెస్ నాయకులు, అభ్యర్థులు అడగటాన్ని ప్రజలు ఈసడించుకుంటున్నారన్నారు. కళ్యాణలక్ష్మీ షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్లు, ఆసరా పింఛన్ల పెంపు, 24గంటల ఉచిత విద్యుత్ ఇలా అనేక సంక్షేమ పథకాలన్నీ కేసీఆర్ వచ్చాకే అమల్లోకి తీసుకొచ్చారన్నారు. 50 యేండ్లపాటు పాలన సాగించిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడమలవుతున్న పథకాలను తీసుకు రావాలనే ఆలోచన ఎందుకు రాలేదని సండ్ర అన్నారు. ప్రజలను ఓట్లడిగే అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు. మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక సత్తుపల్లి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని సండ్ర స్పష్టం చేశారు.

ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, సర్పంచులు, ఉప సర్పచులు నల్లంటి ఉదయలక్ష్మి, రమేశ్, తుంబూరు సరస్వతి, కాల్నేని వెంకటేశ్వరరావు, ఒగ్గు విజయలక్ష్మి, పెద్దిరెడ్డి పురుశోత్తమరావు, నాయకులు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకరరావు, ఒగ్గు శ్రీనివాసరెడ్డి, మోరంపూడి బ్రదర్స్, సాదు జానకిరామ్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) వైరా ఎన్నికల నిధికి రూ.50 వేలు విరాళం

నవతెలంగాణ-వైరాటౌన్

సీపీఐ (ఎం) వైరా అసెంబ్లీ అభ్యర్థి భూక్యా వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ వైరా మండలం ఉప్పలమడక గ్రామం మహిళా కామ్రేడ్లు ఎన్నికల నిధికి 50 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు, రుద్రాక్షుల వెంకటాచారి, మేడా శరాబంధి, వెదుళ్ళ పుల్లయ్య, గరుడేపల్లి సుబ్బారావు ఆద్వర్యంలో మహిళా కామ్రేడ్లు వైరా పట్టణంలో బొంతు రాంబాబు అద్యక్షతన జరిగిన నామినేషన్ సభలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెదుళ్ళ కృష్ణకుమారి వార్డు మెంబర్ ముక్తమాల జ్యోత్స్న సిపిఐ(ఎం) మహిళా నాయకులు గరిడేపల్లి మల్లేశ్వరి, గరిడేపల్లి కస్తూరి, ధారా మెర్సమ్మ, బూరుగు కళ్యాణి, గరిడేపల్లి స్వరూప, మంచికంటి కళావతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వ మతోన్మాద విధానాలు అత్యంత ప్రమాదకరం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు
- సీపీఐ(ఎం) కార్యకర్త ఎర్రబోయిన నాగేశ్వరరావు సంస్మరణ సభ

నవ తెలంగాణ - బోనకల్



కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలు దేశానికి అత్యంత ప్రమాదకరంగా మారాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త ఎర్రబోయిన నాగేశ్వరరావు సంస్మరణ సభ ఏడునూతల లక్ష్మణరావు అధ్యక్షతన శనివారం జరిగింది. నాగేశ్వరరావు ప్రజా హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతాడన్నారు. కొంతమంది సంపదను దానం చేస్తారని, కొంతమంది పార్టీ కోసం సమయం కేటాయిస్తారని, మరికొందరు తమ ప్రాణాలను త్యాగం చేస్తారని అన్నారు. ప్రాణత్యాగం చేసినవాడు కమ్యూనిస్టు పార్టీ ఉన్నంతకాలం ప్రజా హృదయాలలో నిలిచిపోతాడు అన్నారు. గోవిందాపురం ఎల్ గ్రామంలో సీపీఐ(ఎం) లేకుండా కాంగ్రెస్ గూండాలు చేయాలనే కక్షతోనే ఎర్రబోయిన నాగేశ్వరరావుని అతి కిరాతకంగా హత్య చేశారన్నారు. ఉమ్మనేని బాబు, ఉమ్మనేని రమేష్ లాంటి వారు ఎర్రజెండాను ఏమీ చేయలేరన్నారు. తెలంగాణ పోరాటాలకు, ప్రజా ఉద్యమాలకు పెద్ద బీరవల్లి, ముష్టికుంట్ల, గోవిందపురం ఎల్ గ్రామాలు కేంద్ర బిందువులుగా ఉన్నాయన్నారు. కమ్యూనిస్టులకు కష్టాలు, త్యాగాలు, నిర్బంధాలు కొత్త కాదన్నారు. కమ్యూనిస్టులు తిరిగి దాడి చేస్తే ఈ గూండాలు గ్రామంలో ఉండలేరని హెచ్చరించారు. బాబు, రమేష్ రాజకీయ ఉన్మాదులుగా, ఉగ్రవాదులుగా, రౌడీలుగా, హంతకులుగా తయారయ్యారని విమర్శించారు.

మధిర నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించటమే ఎర్రబోయిన నాగేశ్వరరావుకు ఇచ్చే నిజమైన నివాళి అని పార్టీ మధిర నియోజకవర్గ అభ్యర్థి, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఎర్రబోయిన నాగేశ్వరరావు నికార్సైన కార్యకర్త అన్నారు. తాను నామినేషన్ వేసే ముందు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల స్థూపానికి, నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించానని అన్నారు. నామినేషన్ వేసిన తర్వాత కూడా తొలి సభ నాగేశ్వరరావు సభనుంచే ప్రారంభమైందన్నారు. నాగేశ్వరరావుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సిపిఎం అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, ఐలు రాష్ట్ర నాయకులు ఏడు నూతల శ్రీనివాసరావు, సిపిఎం చింతకాని మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, లక్ష్మీపురం ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథ జిల్లా నాయకులు మలీదు నాగేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మాట్లాడారు.

ఈ సభలో మాజీ ఎంపీపీలో తుళ్లూరు రమేష్, చిట్టుమోదు నాగేశ్వరరావు, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు, సిపిఎం నాయకులు వత్సవాయి జానకిరాములు, బండి చందర్రావు, పొన్నం రాంబాబు, మర్రి తిరుపతిరావు, గుగులోతు పంతు, కళ్యాణపు బుచ్చయ్య, కోట కాటయ్య, కొమ్ము కమలమ్మ, పాపినేని రామ నరసయ్య, గుడ్డూరి ఉమ, సిపిఎం వైరా నాయకులు కొణిదెల కోటేశ్వరరావు, సిపిఐ నాయకులు జక్కుల రామారావు వివిధ గ్రామాల సిపిఎం శాఖా కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు స్తూపావిష్కరణ

ఎర్ర బోయిన నాగేశ్వరరావు స్థూపాన్ని సిపిఎం గోవిందాపురం ఎల్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ మాదినేని నారాయణ ఆవిష్కరించారు. నాగేశ్వరరావు స్థూపము వద్ద ఏర్పాటు చేసిన సిపిఎం దిమ్మెపై పతాకాన్ని పోతినేని సుదర్శన్ రావు ఎగరవేశారు. స్థూపానికి సిపిఎం మధిర నియోజకవర్గ అభ్యర్థి పాలడుగు భాస్కర్, పొన్నం వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

భారీగా పోలీస్ బందోబస్తు

ఎర్రబోయిన నాగేశ్వరరావు సంస్మరణ సభ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మధిర సీఐ జానోట్ వసంత కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎర్రుపాలెం, మధిర పట్టణం, మధిర రూరల్, బోనకల్ ఎస్సైలతో పాటు సుమారు 50 మంది పోలీస్ సిబ్బందితో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగేశ్వరావు కుటుంబానికి ఆర్థికసాయం

ఎర్రబోయిన నాగేశ్వరావుది అతి నిరుపేద కుటుంబం కావడంతో వారి కుటుంబానికి సీపీఐ(ఎం) తూటికుంట్ల గ్రామశాఖ రూ. 15 వేలను సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, గోవిందాపురం ఎల్ గ్రామ మాజీ సర్పంచ్ మాదినేని నారాయణకు గోవిందాపురం ఎల్ గ్రామంలో మాజీ ఎంపీపీ తుళ్లూరు రమేష్, తూటికుంట్ల మాజీ సర్పంచ్ పాపినేని రామ నర్సయ్య శనివారం అందజేశారు.



హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ కూటమిని గెలుపు

- ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు

నవతెలంగాణ-ఖమ్మం

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) లో 2023-2024 గుర్తింపు ఎన్నికల్లో మతోన్మాద ఎబివిపిని మట్టి కరిపించి ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఏ, టిఎస్ఎఫ్ కూటమికి విజయం సాధించిన సందర్భంగా ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి తీసుకుని వస్తున్న విద్యా వ్యతిరేఖ విధానాలపై పోరాడుతు, నూతన విద్యావిధానం రద్దుచేయాలని, సెంట్రల్ యూనివర్శిటీలకు నిధులు తగ్గింపు, ఫెలోషిప్



విడుదల చేయకపోవడం, అనుబంధ ఆరెస్సెస్ భావాజాలం విద్యారంగంలో సిలబస్, పాఠాలు తొలగింపు అంశాలపై విద్యార్థులు పోరాడుతున్నారు. యూనివర్శిటీ ఎన్నికల్లో ఎబివిపి, ఎన్ఎస్యూఐ అనేక ఆటంకాలు సృష్టించిన యూనివర్శిటీలో నిరంతరం విద్యార్థుల పక్షాన పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ తోనే ఉన్నారని, గత యూనియన్ యూనివర్శిటీలో అనేక సమస్యలపై పోరాడిందని, విద్యార్థులు అడ్మిషన్ల సందర్భంగా ఫీజులు పెంపు వ్యతిరేకంగా నిలబడి నిఖరంగా పోరాడిందని తెలిపారు. ఈ దేశానికి బిజెపి, ఆరెస్సెస్ ఓడించడానికి యేం అవసరవే యూనివర్శిటీలో వామపక్ష, సామాజిక శక్తులు అవసరాన్ని తెలిపారు. దేశంలో నయ ఉదారవాద, కార్పోరేట్ ఫాసిస్టు శక్తులు అధికారంలో ఉంటే వారికి వ్యతిరేకంగా హెచ్‌సీయూలో విద్యార్థులు గెలుపు ప్రగతిశీల శక్తులకు, ప్రజాస్వామ్య వాదులకు ఇది స్ఫూర్తి దాయకం, ఈ గెలుపు అందించిన హెచ్‌సియు. విద్యార్థులకు తెలంగాణ, ఖమ్మం జిల్లా కమిటీ పక్షాన శుభాకాంక్షలు, ధన్యవాదములు తెలిపారు.

బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో అక్రమ మద్యంపై ఉక్కు పాదం మోపాలన్న ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం పాలేరు నియోజకవర్గంలోని బెల్ట్ షాపులపై దాడులు కొనసాగుతాయని సిఐ రాజిరెడ్డి తెలిపారు. శనివారం తిరుమలాయపాలెం మండల పరిధిలోని పిండిప్రోలు, దమ్మాయిగూడెం, బీరోలు, తెట్లపాడు, పలు గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి పలు బెల్ట్ షాపులలో మద్యాన్ని స్వాధీనపరుచుకున్నారు. వారిపై జరిమానా విధించారు. పాలేరు నియోజకవర్గంలో అక్రమ మధ్య నిర్వహిస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమో చేస్తామని ఇప్పటికే బెల్ట్ షాపుల యాజమాన్యాన్ని బైండ్ ఓవర్ చేశామని, మరల అక్రమ విక్రయాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మట్టి పనికి పోవాలన్నా మనోడు ఉండాలి

- ఖమ్మం, పాలేరులో చెల్లని రూపాయి మళ్ళీ ఖమ్మం వచ్చింది
- బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్

నవతెలంగాణ-ఖమ్మం

వెనకటికి ఒక నానుడి ఉండేది.. మట్టి పనికి పోవాలన్నా మనోడు ఉండాలి.. పరాయి వాడు ఉంటే మోసం చేస్తాడు జాగ్రత్త.. అని ఉండేదని ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి పరయివాడు అని నేను ఇక్కడి వాడిని ఖమ్మం లోకల్ అని బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. శనివారం నగరంలోని 6వ డివిజన్ ప్రశాంతి నగర్‌లో కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు అధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిచినా ఓడినా ఇక్కడ ఉండడు.. రాత్రి అయితే హైద్రాబాద్.. లేక సత్తుపల్లి పోతాడు.. కానీ నేను ఇక్కడే ఉంటా.. నేను లోకల్ అని అన్నారు.



రద్దయిన నీ రాజకీయ జీవితాన్ని కేసీఅర్ పిలిచి మంత్రి పదవి ఇస్తే.. కేసీఅర్ నే మోసం చేసావు. నిన్ను నమ్మి పదవి ఇస్తే నువు చేసింది ఏమీ లేదు.. గుండు సున్నా.. నువ్వే గెలవలేదు.. ఇంక ప్రజలకు ఏం చేస్తాడని విమర్శించారు. నేను వజ్రాయుధం లాంటి వాడను.. నన్ను ఇప్పుడు కాపాడుకుంటే జీవితాంతం మీరు గర్వపడేలా ఖమ్మంను అభివృద్ధి చేసి మీకు అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళీ లక్ష్మీ నారాయణ, గుండెటి మాధవరావు, జగన్మోహన్‌రావు, జగదీష్, తిరుపతిరావు, దేవభక్తుని కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం అంటేనే సండ్రా

- ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కల్లూరు



బీఆర్ఎస్ పార్టీ గడపగడపకు ప్రచారంలో భాగంగా చంద్రుపట్ల గ్రామంలో బీసీ కాలనీ ఏరియాలలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు నాయకత్వంలో శనివారం సండ్ర వెంకట వీరయ్య గెలుపు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్లమందల ప్రసాదు బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాసరావు, వల్లభనేని రవికుమార్, దొడ్డబెని రవి థామస్, కొమ్మినేని రామారావు, నెల్లూరు రామకృష్ణ, గోసు రమణయ్య, తన్నీరు ఫైండ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల సమక్షంలో సర్పంచులు, ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-వేంసూరు

వేంసూర్ మండలంలో శనివారం బిఆర్ఎస్ పార్టీకి పలువురు ప్రజా ప్రతినిధులు మండల స్థాయి నాయకులు రాజీనామా చేసి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో ఖమ్మంలో మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో వేంసూర్ సర్పంచ్ ఎండి.ఫైజుద్దీన్, అమ్మపాలెం సర్పంచ్ మేడ రమేష్, ఎర్రగుంట సర్పంచ్ గడ్డం ప్రతాపరెడ్డి, కుంచపర్తి ఎంపీటీసీ కిన్నెర వెంకటేశ్వరావు, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వెల్ది జగన్మోహన్‌రావు, రామన్నపాలెం ఉపసర్పంచ్ ఉపేందర్‌రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు గడిపర్తి రాంబాబు, మాజీ ఎంపీపీ మోటాపోతుల జగన్నాథంతో పాటు మరో 50 మంది నాయకులు ఉన్నారు. వీరికి తుమ్మల నాగేశ్వరరావు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

అక్రమం మద్యం నిల్వలపై ఎక్సైజ్ దాడులు

నవతెలంగాణ-కారేపల్లి

అక్రమంగా మద్యంను నిల్వ ఉంచి అమ్మకాలు సాగిస్తుండగా శనివారం సింగరేణి ఎక్సైజ్ అధికారులు మద్యంను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై బీ.రమణ తెలిపారు. కారేపల్లి మండలం చీమలపాడు, గేటురేలకాయలపల్లి గ్రామాల్లో బిక్కులాల్, బాలాజీలు అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్నారు. సమాచారం మేరకు మద్యం నిల్వలపై దాడులు చేసి వారిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు. మద్యం నిల్వ ఉంచిన, విక్రయాలు జరిపినా కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ ఎస్సై తెలిపారు.



చుట్టం చూపుగా వచ్చిన భట్టికి విశ్రాంతి ఇద్దాం

- బీఆర్ఎస్ మధిర అభ్యర్థి లింగాల కమల్ రాజు

నవతెలంగాణ-మధిర

చుట్టం చూపుగా మధిరకు వచ్చిన భట్టి విక్రమార్కకు ఇక విశ్రాంతి ఇద్దామని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు అన్నారు. శనివారం మధిర మండలంలోని మాటూరుపేట, నాగవరప్పాడు, మర్లపాడు, సైదల్లిపురం నిధనపురం గ్రామాల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కారు గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించి ఒక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం సుభిక్షం

- కామేపల్లిలో హరిప్రియ ప్రచారం

నవతెలంగాణ-కామేపల్లి

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్రం సుభిక్షం అని బీఆర్ఎస్ ఇల్లందు నియోజకవర్గ అభ్యర్థి బాణోత్ హరిప్రియ అన్నారు. శనివారం కామేపల్లి మండలంలో హరిప్రియ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామ గ్రామాన అందడంతో ప్రజలు అడుగడుగునా ఆదరిస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీకి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలే శ్రీరామరక్ష అన్నారు. కామేపల్లి మండలంలో జోగ్గూడం ఊటుకూరు రామకృష్ణాపురం, కామేపల్లి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు కార్యకర్తలు



గజమాలతో స్వాగతం పలికారు. హరిప్రియ గెలుపు ఖాయం అని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ధనికుల హన్మంతరావు, వైస్.ఎంపిపి విజయలక్ష్మీ, రైతు సమన్వయ సమితి మండల అద్యక్షులు ఆంతోటి అచ్చయ్య, కేళోత్. భాస్కర్, కీసర విష్ణువర్ధన్‌రెడ్డి, గుండ్లరవిబాబు అజ్మీరా బన్ని, రాందాస్, రాజు, రాంబాబు, చందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం పెగళ్ళపాడు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన సగ్గుర్తి గణేష్‌కి ఇటీవల ఆక్సిడెంట్‌లో తలకు తీవ్రమైన గాయంతో ఖమ్మంలోని కిమ్స్ హాస్పిటల్‌లో ఆపరేషన్‌కు సుమారు రూ.3లక్షలు అవసరం కావటంతో జాంబవవారసులం గ్రూపుని సహాయం కోరడంతో గ్రూపు ద్వారా తలా కొంత జమచేయగా వచ్చిన రూ.24,300లను శనివారం ఖమ్మంలోని కిమ్స్ హాస్పిటల్‌లో మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారపోగు సుధాకర్, ప్రముఖ అడ్వకేట్ కరాటే రాము చేతుల మీదుగా గణేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ కిన్నెర వెంకటేశ్వర్లు, చావల వెంకటేశ్వరరావు, పేరెల్లి శ్రీను, మరికంటి కన్నారావు, పెనుగూరి కోటేశ్వరరావు, చెరుకుపల్లి నాగేశ్వరరావు, ఆరెంపుల అంబేద్కర్, యడెల్లి వెంకట్, కారుమంచి శ్రీను, చాపలమడుగు మధు, కాకర్లముడి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి కాంగ్రెస్

- మధిర అభ్యర్థి భట్టి విక్రమార్క

నవతెలంగాణ-చింతకాని

ఆరు గ్యారంటీలతో అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వస్తుందని సీఎల్పీ నేత, కాంగ్రెస్ మధిర నియోజకవర్గం అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శనివారం చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనని నాలుగోసారి గెలిపించి పాలించేవాడిగా శాసనసభకు పంపించాలని ఓటర్లను కోరారు. తాను డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి తప్ప బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి శూన్యం అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే 6 గ్యారంటీల పథకాలు అమలు చేస్తామని భరోసా



కల్పించారు. తాను శాసనసభ్యునిగా మధిర నియోజకవర్గ ప్రతిష్ట పెంచానన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి, నాయకులు భాస్కర్, గోపి, గోవిందరావు, సూరారెడ్డి, మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ప్రగతి, ఎంపిటిసి ఓర్సు వీరభద్రం, చలమారెడ్డి, కూరపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తాటిపల్లి సుధీర్‌కి గురు స్పందన పురస్కార్ 2023 అవార్డు

నవతెలంగాణ-కొణిజర్ల



ఖమ్మం ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల స్థాయిలో జరిగిన స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీచర్స్ రిలేషన్ ఇన్ ఎడ్యుకేటింగ్ ఫర్ నేషనల్ డెవలప్మెంట్‌లో భాగంగా పల్లిపాడు ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్‌కి గురు స్పందన పురస్కార్ 2023 అవార్డ్‌ను స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ ఈద శామ్యూల్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం శామ్యూల్‌రెడ్డి మాట్లాడుతూ సంస్థ ముఖ్య ఉద్దేశ్యం ఆత్మహత్యలు లేని భారతదేశాన్ని చూడటం.. అందులో భాగంగానే ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్ తన మోటివేషన్ ద్వారా ఎంతో మంది విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని నింపటమేకాక ఇప్పటి వరకు 25 మందిని ఆత్మహత్యా ప్రయత్నం నుంచి రక్షించినందుకు తాటిపల్లి సుదీర్‌కి ఈ అవార్డ్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలో పని చేసే ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అప్పమ్మ మృతికి నివాళులు

నవతెలంగాణ-కల్లూరు

పట్టణంలోని పుల్లయ్య బంజారా రోడ్డుకు చెందిన గుళ్ల అప్పమ్మ శనివారం మరణించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళురల్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అస్మత్ చందర్రావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరళ్ల విశ్వనాథంకు నివాళులు

నవతెలంగాణ-తల్లాడ



స్వాతంత్ర సమరయోధులు, మాజీ సర్పంచ్ నేరళ్ల విశ్వనాథం (88) మరణించారు. శనివారం ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజలు ఆయనకు ఘన నివాళు లర్పించారు. ఆయన మృతదేహాన్ని మమతా మెడికల్ కాలేజీకి అందజేశారు.

పాఠశాలల్లో దీపావళి సంబురాలు


స్మార్ట్ కిడ్జ్‌లో...

స్మార్ట్ కిడ్జ్‌లో దీపావళి సంబురాలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం దీపావళి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాలలో చిన్నారులు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాలలో ప్రమిదలు వెలిగించి, కాలుష్య రహిత బాణసంచా కాల్చి ఆనందోత్సవాలు


శ్రీనగర్ రెజొనెన్స్‌లో ...

జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెజొనెన్స్‌లో ....

నగరంలోని శ్రీనగర్ కాలనీలో రెజొనెన్స్ స్కూల్‌లో శనివారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్


సర్వజ్ఞ స్కూల్లో ...

రావు, పాఠశాల డైరెక్టర్ కొండా కృష్ణవేణి, ప్రధానోపాధ్యాయులు ఎం.ప్రసన్నరావు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వజ్ఞ స్కూల్లో ...

నగరంలోని వీడివోస్ కాలనీలోని సర్వజ్ఞ పాఠశాలలోని విద్యార్థులు దీపావళి పండుగను శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ ఆర్‌వి. నాగేంద్రకుమార్, నీలిమ, ప్రిన్సిపల్ మానస ఉపాధ్యాయ,


బ్లూమింగ్ మైండ్స్ సెంటర్ స్కూల్లో...

ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

న్యూఇరా పాఠశాలలో...

నగరంలోని న్యూఇరా పాఠశాలలో దీపావళి పర్వదిన వేడుకలు శనివారం అట్టహాసంగా


న్యూఇరా పాఠశాలలో...

నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఐవి. రమణారావు, డైరక్టర్ డాక్టర్ పి. భూమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్లూమింగ్ మైండ్స్ సెంటర్ స్కూల్లో...

నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో శనివారం దీపావళి


రెజొనెన్స్ ది స్కూల్ శ్రీనివాసనగర్‌లో....

వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్


ట్రైనిటాట్స్ పాఠశాలలో...

కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రెజొనెన్స్ ది స్కూల్ శ్రీనివాసనగర్‌లో....

ఖమ్మం శ్రీనివాసనగర్‌లోని రెజొనెన్స్ పాఠశాలలో దీపావళి పండుగ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి. నాగేంద్ర కుమార్, నీలిమా మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులందరకి ఈ దీపావళి పండుగను గురించి వివరించారు.

ట్రైనిటాట్స్ పాఠశాలలో...

ట్రైనిటాట్స్ హైస్కూల్లో దీపావళి సంబురాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ మాట్లాడుతూ టపాసులు కాల్చేటపుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సబిత,


మధిర శ్రీనిధి పాఠవాలలో..

సంధ్య, అలేఖ్య, జ్యోతితో, నాగమణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధి పాఠశాలలో దీపావళి సంబరాలు

మధిర : మధిరలోని శ్రీనిధి పాఠశాలలో ముందుగానే దీపావళిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ బి.అంజన్ బాబు, పాఠశాల డైరెక్టర్ చందు, వెంకటనారాయణ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

శాసనసభ సాధారణ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం ఏర్పాటులో భాగంగా మండల పరిధిలో పొన్నెకల్లులోని శ్రీచైతన్యజి యంత్రవిద్య కళాశాల భవనంలో ఏర్పాటు చేసిన మోడల్ కౌంటింగ్ కేంద్రాన్ని సత్తుపల్లి నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు సతేంద్ర సింగ్, కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, ఈవీఎంలు భద్రపరిచే ర్యాక్‌లు, మోడల్ కౌంటింగ్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి టేబుల్, పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు పరిశీలించారు. లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన 14 టేబుళ్లు, రాజకీయ పార్టీల ఏజెంట్లు, చూడడానికి వీలుగా ఏర్పాటు చేసిన బారీకెడ్లు టేబుళ్లను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంల రవాణా, రిటర్నింగ్ అధికారి, ఇతర అధికారులు ప్రవేశం,




అభ్యర్థుల, అభ్యర్థుల ఏజెంట్ల ప్రవేశాల ద్వారాలను పరిశీలించారు. ఎన్నికల పరిశీలకులు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, ఆర్డీవోలు గణేశ్, అశోకచక్రవర్తి, పాలేరు ఆర్. రాజేశ్వరీ, జిల్లా సంక్షేమాధికారి సుమ, సిబ్బంది పాల్గొన్నారు.

పువ్వాడ గెలుపు కోసం రాత్రి కూడా ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 42వ డివిజన్ లో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు షబ్బీర్ ,గురుమూర్తి ఆధ్వర్యంలో పువ్వాడ గెలుపు కోసం రాత్రి కూడా ప్రచారం జోరుగా సాగించారు. ఖమ్మం శాసన సభ్యులు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ గెలుపు కొరకు 42వ డివిజన్ అంతట తిరుగుతూ జై



పువ్వాడ,జై కేసీఆర్,జై కేటీఆర్, అంటూ డివిజన్ నాయకులు కార్యకర్తలు కలిసి రాత్రి పూట కూడా కష్టపడుతూ పువ్వాడ ను గెలిపించాలని ప్రచారం జోరుగా సాగించారు. డివిజన్ మొత్తం తిరుగుతూ ప్రజాసంక్షేమ రథసారధి, అభివృద్ధి ప్రదాత పువ్వాడ అజయ్ కుమార్ కి ఓటు వేసి కారు గుర్తు ను గెలిపించాలని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కలిసి డివిజన్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో షాదీఖానా చైర్మన్ మజీద్,షాదిఖానా డైరెక్టర్ ముజాహిద్, మైనార్టీ నగర అధ్యక్షుడు షంసుద్దిన్, హకీమ్,సొహెల్, నయీం, జాని, తజ్ముల్ల, అబ్బాస్, హుస్సేన్,నాని,లింగరాజు, మహిళా నాయకులు పర్వీన్, రమాదేవి, శైలజ, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ యూత్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మీ ఆడబిడ్డగా వచ్చా ఆదరించండి

సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి మట్ట రాగమాయి

నవతెలంగాణ- వేంసూరు

మీ ఆడబిడ్డగా మీ ముందుకు వచ్చా ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి మట్ట రాగమాయి అన్నారు శనివారం మండలంలో ప్రచారాన్ని నిర్వహించారు దుద్దెపూడి కందుకూరు భరణి పాడు వెంకటాపురం లచ్చన్న గూడెం మర్లపాడు వేంసూరు తదితర గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులతో ప్రచారాన్ని నిర్వహించారు కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా మా కుటుంబం ప్రజలతోనే ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మీ ముందు ఉన్నామని మీ ఆడబిడ్డగా ఆదరించి అసెంబ్లీకి పంపిస్తే మీకు సేవ చేస్తానని ప్రతి ఒక్క కార్యకర్తకు అందుబాటులో ఉంటామని అన్నారు ప్రచారంలో మట్ట దయానంద్ జిల్లా ఉపాధ్యక్షులు పుచ్చకాయల సోమిరెడ్డి బండి గుర్నాథ్ రెడ్డి శ్రీనివాసరెడ్డి పల్లెవాడ నరసింహారావు వెంకటప్ప రెడ్డి మేడ వెంకటేశ్వరరావు కుక్క పల్లి శ్రీనివాసరావు ఫక్రుద్దీన్ తదితరులు ఉన్నారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ కార్గో

నవతెలంగాణ-కారేపల్లి

ఆర్టీసీ కార్గో సర్వీస్ బస్ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసకవెళ్ళి మట్టిలో కూరకపోయిన ఘటన కారేపల్లి మండలం సీతారాంపురం వద్ద శనివారం చోటుచేసుకుంది. ఖమ్మం నుంచి ఇల్లందు వెళ్తున్న ఆర్టీసీ కార్గో బస్ సీతారాంపురం సమీపంలో రోడ్డు పక్కకు దూసుకవెళ్లింది. పక్కనే పోలాల పక్కకు వెళ్ళి బురదలో కూరకపోయింది. అధిక లోడ్‌తో ఉన్న బస్‌ను బయటకు తీసేందుకు డ్రైవర్ ప్రయత్నం ఫలించలేదు. దీంతో ఖమ్మం నుండి వేరే వాహనాన్ని తీసుకవచ్చి కూరకపోయిన బస్‌ను తీసేందు ప్రయత్నిస్తున్నట్లు డ్రైవర్ తెలిపారు.

స్వామివారికి పంచామృతాలతో అభిషేకం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం కావడంతో భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు .తెల్లవారు జామునే స్వామి వారికి పంచామృతాలతో సర్వాంగ అభిషేకం ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమలాపురం శ్రీ వెంకటేశ్వర సేవా సమితి వారి ఆధ్వర్యంలో దాత ఖమ్మం గ్రానైట్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు నిర్మల కుమారి దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంభాని కాంగ్రెస్‌ని వీడడాన్ని ఖండించిన నాయకులు

నవతెలంగాణ-తల్లాడ

40 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీలో ఉండి సంభాని చంద్రశేఖర్ కన్నతల్లి లాంటి జాతీయ కాంగ్రెస్ పార్టీని వీడి ప్రాంతీయ పార్టీలో చేరడాన్ని తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం తల్లాడలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశమై చంద్రశేఖర్ పార్టీనీ వీడిన విషయాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాంతారెడ్డి, కాపా అప్పయ్య మాలోతు హుస్సేన్ నాయక్, కటిక కిరణ్, ఐలూరు వెంకటేశ్వరరెడ్డి, దీవెన కృష్ణయ్య, ఎర్రి కృష్ణారావు, ముత్వా రోశయ్య, తాళ్ల వెంకటేశ్వర్లు, పోనాటి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-ఖమ్మం

సత్తుపల్లి నియోజకవర్గ వేంసూరు, మండలం బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు జగన్మోహన్ రావు, వేంసూర్ సర్పంచ్ ఎండి. ఫైజుద్దీన్, ఎర్రగుంటపాడు సర్పంచ్, గడ్డం ప్రతాప్‌రెడ్డి, అమ్మపాలెం సర్పంచ్ మెడ రమేష్ బాబు, మాజీ ఎంపీపీ జగన్నాథం, కుంచపర్తి ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, రాముండపాలెం, సర్పంచ్ వెంకటేశ్వరరావు, సమన్వయ కమిటీ, మెంబర్ నరసింహారావుతో పాటు మండలానికి చెందిన ముఖ్య నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ నా నిర్ణయంకు కట్టుబడి మీరు కాంగ్రెస్‌లో చేరడం సంతోషమన్నారు. ఈ ఎన్నికలు భవిష్యత్ తరాల కోసం ప్రతిష్టాత్మకం తుమ్మలకు ముందు తుమ్మల తరువాత ఏంటో వేంసూరు ప్రజానీకం ఆలోచన చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది నియోజక వర్గాల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు.

కల్లూరు : మండల పరిధిలోని రామకష్ణ పురం గ్రామంలో 50 మంది బిఆర్ఎస్ కార్యకర్తలు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్, మాజీ ఆత్మ కమిటీ ఛైర్మన్ నున్న రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు కొత్తూరు ప్రభాకర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు భాగం ప్రభాకర్‌రావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల నెల వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ఎన్జీఆర్ సేవా కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు పిలుపు

నవతెలంగాణ-నేలకొండపల్లి



నేడు ఆదివారం ఉదయం 6 గంటలకు సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్ రావు (ఎన్.జి.ఆర్) సేవా కమిటీ ఆధ్వర్యంలో నేలకొండపల్లిలోని సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో జరిగే నెల నెల వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సేవా కమిటీ కన్వీనర్ ఎటుకూరి రామారావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో బీపీ షుగర్ తో పాటు ఇతర అనారోగ్య సమస్యలకు కూడా ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో చెవి ముక్కు గొంతు ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ గుడిపూడి రాజేష్, డాక్టర్ కొల్లి అనుదీప్ ఎండి (జనరల్ మెడిసిన్) రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. షుగర్ పరీక్షలు ముందుగా చేయించుకుని వచ్చే వారికి వెంటనే మందులు పంపిణీ చేయడం జరుగుతుందని లేనియెడల ఉదయం ఆరు గంటలకే వైద్య శిబిరానికి వచ్చి షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. బీపీ షుగర్ రోగులకు వంద రూపాయలకే ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే వైద్య శిబిరం జరుగుతుందని ప్రజలు సకాలంలో హాజరై వైద్య సేవలు పొందాలని సూచించారు. పేదలకు వైద్యాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావాలనే సేవా దృక్పథంతో నెలనెలా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరింత సమాచారం కొరకు 9490098225, 9030897480, 9949592544, 9110364581 లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్జీఆర్ సేవా కమిటీ నిర్వాహకులు గుడవర్తి నాగేశ్వరరావు, కెవి రామిరెడ్డి, వల్లంచెట్ల భాస్కర్ రావు, కట్టెకోల వెంకన్న పాల్గొన్నారు.

దీపావళి శుభాకాంక్షలు

- ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే హరిప్రియ హరి సింగ్

నవతెలంగాణ-ఇల్లందు



దీపావళి పర్వదినం(దీపాల పండుగ) సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే హరిప్రియ హరిసింగ్ లు ఇల్లందు నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ వాసులు, దేశవిదేశాలలో స్థిరపడిన, నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకటిని పారదోలి వెలుగుల్ని ప్రసరింపజేసే ఈ పండుగకు భారతీయ సంస్కృతిలో విశిష్టత ఉందన్నారు. ప్రతి ఇంట శాంతి సౌభాగ్యాలు, సిరిసంపదలతో వెలుగులు విరజిమ్మాలని ఎంపీ వద్దిరాజు ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.అన్ని వర్గాల వారు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ప్రమాదాలకు దూరంగా తగు జాగ్రత్తలతో ప్రశాంత వాతావరణంలో పండుగను ఘనంగా జరుపుకోవాలని ఎంపీ రవిచంద్ర అభిలషించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఒకరికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-అశ్వారావుపేట

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. మండల పరిధిలోని అచ్యుతాపురం-కొత్తూరు కాలనీ రహదారి మధ్యలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో దమ్మపేట మండలం రంగువారి గూడెంకు చెందిన చింతల ప్రకాష్, నారంవారిగూడెం వైపునుండి వెళ్తుండగా అచ్యుతాపురం వైపునుండి వస్తున్న ద్విచక్ర వాహనదారులు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో చింతల ప్రకాష్ కుడి కాలుకు తీవ్ర గాయం అవడంతో చిట్టితల్లి అంబులెన్స్‌లో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రకాష్ ప్రమాద వార్త తెలిసిన చిట్టితల్లి అంబులెన్స్ నిర్వాహకుడు మనుగొండ వెంకట ముత్యం ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుడిని పరామర్శించారు.

గంధసిరిలో ఓటు హక్కుపై అవగాహన

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో గంధసిరి ఇందిరమ్మ కాలనీలో ఓటు హక్కు వినియోగంపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విడివి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. వినియోగించే ఓటు హక్కును నిజాయితీగా వెయ్యాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకూడదన్నారు. భావిభారత విద్యార్థులు ఓటుహక్కు వినియోగంపై తల్లిదండ్రులు నిరక్షరాస్యులలో చైతన్యాన్ని పెంపొందించాలన్నారు. సి.విజిల్ యాప్ ద్వారా ఏదైనా డబ్బు, మద్యం పంపిణీ చేసినచో ఫిర్యాదు చేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో యం.పి.డి.ఓ. ఎంపిఓ పి.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కె.నరేష్, గ్రామపంచాయతీల బిఎల్ఓలు, ఆశాకార్యకర్తలు, ఐకెపి గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గోకినేపల్లిలో లింగాల కూతురు విస్తృత ప్రచారం

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలో గోకినేపల్లిలో మధిర నియోజకవర్గ బారాస అభ్యర్థి లింగాల కమల్ రాజు విజయాన్ని కాంక్షిస్తూ లింగాల కూతురు అభిజ్ఞ శనివారం ఇంటింటికి తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. తన తండ్రి లింగాలను గెలిపిస్తే ముదిగొండ మండలం మరింత అభివృద్ధి జరిగిందని ఆమె ఓటర్లను కోరారు. తండ్రి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో బారాస జిల్లా నాయకులు మీగడ శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీటీసీ మీగడ నీరజకుమారి, బారాస గ్రామ శాఖ కార్యదర్శి తోటమల్ల గురుమూర్తి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పేదలకు భరోసా

నవతెలంగాణ-మణుగూరు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో పేదల బతుకులకు భరోసా కల్పిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు అన్నారు. శనివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామం నందు, గ్రామ అధ్యక్షులు ఉప్పట్ల వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్స్ ఉడతనని రవి, గుమ్మాల రాంబాబు, ఆత్మకమిటీ మునిగేలా శ్రీను, బూత్ ఇంచార్జ్ వడ్లమను రాము ఆధ్వర్యంలో 30 కుటుంబాలు పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారిని నాగేశ్వరరావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధిని కొనసాగిద్దాం అని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాము, నర్సింహారావు, ఇరన్న, రమేష్, నరసింహారావు, దామోదర్, సుదర్శన్, మల్లయ్య పార్టీ సీనియర్ నాయకులు, మహిళ నాయకులు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అకిట్స్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ-సుజాతనగర్



మండలంలోని వేపలగడ్డ నందు గల అబ్దుల్ కలామ్ ఇంజనీరింగ్ కళాశాల నందు శనివారం నాడు ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్‌లు రమేష్, శ్రీకాంత్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థిని, విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ లు మాట్లాడుతూ విద్యార్థులు మధ్య సహృద్భావ వాతావరణం పెంపొందించిన ఈ కార్యక్రమం ఎంతగానో చేస్తుందన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు అవసరమైన సలహాలు అందిస్తూ వారు తమ లక్ష్యసాధనకు కృషి చేసే విధంగా దిశా నిర్దేశం చేయాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలన్నారు. బీటెక్ రెండో సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఘన స్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల హెచ్ఓడిలు వెంకటేశ్వర్లు, బాబురావు, లకపతి, మునీర్, కృష్ణమోహన్, సతీష్ రెడ్డి, వినోద్, అస్మాత్ పాషా, అధ్యాపకులు అయూబ్ నాగరాణి, రోజా, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

- ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



ఆళ్ళపల్లి మండల ప్రజలకు దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి శనివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మనిషి జీవితంలోని చీకట్లను పారద్రోలి వెలుగులు నింపేదే దీపావళి అని అభివర్ణించారు. మండలంలోని ప్రజలందరూ ఈ పండుగను దీపాల వెలుగులు, బాణ సంచాల జిలుగుల నడుమ ఆనందంగా జరుపుకోవాలని, అందురూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న సింహం

- స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్న బస్తీలు, కాలనీలు

నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి

ఎన్నికల ప్రచారంలో కొత్తగూడెం నియోజకవర్గంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జలగం వెంకట్రావుకి లక్ష్మీదేవిపల్లి మండలం ఉమ్మడి రేగళ్ల పంచాయతీ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే జలగం మాట్లాడుతూ తన తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని ఉమ్మడి ఖమ్మం జిల్లాకి ఒక ప్రత్యేకమైన స్థానం కల్పించారని, అదేవిధంగా ఆయన వారసుడిగా తాను బీఆర్ఎస్ పార్టీలో కొత్తగూడెం ఎమ్మెల్యేగా ఉన్న ఐదు సంవత్సరాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని మనం చేసే అభివృద్ధి నేటి తరానికే కాకుండా భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా ఉండాలన్నదే తన తపన అని అన్నారు. ఈ ఎన్నికలలో గెలిపిస్తే కొత్తగూడెం అభివృద్ధి రూపురేఖలు మారుస్తానని చెప్పారు. ఈ సందర్భంగా రేగళ్ల గ్రామ పంచాయతీకి చెందిన ప్రముఖులు స్వచ్ఛందంగా జలగంకు మద్దతు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి జడ్పీటిసి మేరెడ్డి వసంత, మేరెడ్డి జనార్దన్ రెడ్డి, ప్రశాంతనగర్ ఎంపీటీసీ మొక్కల శిరీష, జలగం అభిమానులు కార్యకర్తలు ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



బతుకులు మారాలంటే బీఎస్పీని ఆదరించండి

- నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బాదావత్ ప్రతాప్

నవతెలంగాణ-ఇల్లందు

ప్రజల బతుకులు మారాలంటే బీఎస్పీని ఆదరించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బాదావత్ ప్రతాప్ అన్నారు. పట్టణంలో శనివారం కొందరు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేస్తున్న పోరాటాన్ని గమనించి స్వచ్ఛందంగా పార్టీలో చేరారు. వారిలో ఓం నాద్ లోద్, షేక్ యాకూబ్ పాషా, సాయి పసి, సంతోషి లోద్, భాను జ్యోతి, పట్టణ నాయకులు కాళీ చరణ్ సందీప్ మరియు షేక్ అల్లా బకాష్ ఆధ్వర్యంలో బహుజన్ సమాజ్ పార్టీలో చేరగా వారికి బీఎస్పి నియోజకవర్గ ఇన్చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతాప్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నామినేషన్ ర్యాలీని విజయవంతం చేసిన కార్యకర్తలకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ బండి రమణి, ఇల్లందు నియోజకవర్గ అధ్యక్షులు తచ్చొడి సత్యనారాయణ మండల నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లను తనిఖీ

నవతెలంగాణ-అశ్వారావుపేట



అశ్వారావుపేట నియోజక వర్గం-118 (ఎస్టీ)నకు సాదారణ పరిశీలకులుగా నియమితులైన యస్.గణేష్ నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో ఎన్నికల ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలు, అశ్వారావుపేటలోని ఆర్‌టీఏ చెక్ పోస్ట్, ఎన్నికల అంతర్రాష్ట్ర సెక్ పోస్ట్, ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. వీరు ఇల్లందు సింగరేణి గెస్ట్ హౌస్, లక్ష్మీదేవిపల్లి మండలం (కొత్తగూడెం) నందు పని దినములలో సాయంత్రం 4.00 గం.ల నుండి 5.00 గం.ల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని, వీరి ఫోన్ నెంబర్ 6303715534 అని అశ్వారావుపేట నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి పి.రాంబాబు తెలియజేసారు. ఈయన వెంట సహాయ ఎన్నికల అధికారి, తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్, నోడల్ అధికారి, ఎంపీడీఓ శ్రీనివాస్ రావు, ఎస్ఐ శివ రామ క్రిష్ణ, ఎన్నికల స్థానిక సిబ్బంది ఉన్నారు.



ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించిన రేగా

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో ఈనెల 13వ తేదీన బీఆర్ఎస్ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్ల పనులను విప్, పినపాక శాసనసభ్యులు, పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు పరిశీలించారు. స్థానిక ప్రజాప్ర తినిధులు పార్టీ ముఖ్య నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనులను పరిశీలించి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బిక్కసాని శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ గెలుపు నల్లేరు మీద నడకే

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం

నవతెలంగాణ-పినపాక

కాంగ్రెస్ గెలుపు నల్లేరు మీద నడకే అని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం అన్నారు. శనివారం పినపాక మండలం క్రాస్ రోడ్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు గెలుపును ఆపడం సాధ్యం కాదని, పినపాక మండలంలో పదిహేను వేల ఓట్లు మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే నియోజకవర్గంలో 50 వేల మెజారిటీ వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడగ నాగయ్య, గంగిరెడ్డి వెంకట రెడ్డి, వారా శంకర్, కాంతారావు, గీద సాయి, పడిగా వీరబాబు, గొంది పూర్ణచంద్రరావు, పడిగ సాయి, వంశి, చీమల రమేష్, శ్రీరామ్ ప్రసాదు, మునిగల సతీష్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పాయం వెంకటేశ్వర్లును గెలిపించాలి

నవతెలంగాణ-మణుగూరు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు గెలిపించాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్- ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ సమావేశానికి జాన్ అధ్యక్షత వహించారు. హాజరైన పాయం మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్(ఐ) పార్టీ అభ్యర్థిగా హై కమిటీ నాకు అవకాశం ఇచ్చినదని, ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు నా గెలుపునకు సహకరించాలన్నారు. బి.రాజలింగు, డి.వి.సత్యనారాయణ, బ్రాంచ్ సెక్రటరీలు పీకే ఓసి టు ఫిట్ సెక్రెటరీ టి.పెదనాగయ్య, కేసీహెచ్ పి ఫిట్ సెక్రటరీ శ్యాం వర్మ, ఇ.కిరణ్ ఓసి స్టోర్ ఫిట్స్ సెక్రటరీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.